www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 161 | శనివారం 01.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-






# గోదావరి ఉగ్రరూపం..

## భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



- 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు..
- ప్రాణహిత, ఇంద్రావతి వరదలు ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉపనదులు
- మేడిగడ్డ వద్ద మరింత పెరగనున్న వరద ప్రవాహం
- తీర ప్రాంతవాసులను అప్రమత్తం చేసిన అధికారులు

05

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్గాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10:14 గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. విదర్భ, చత్తీస్ గఢ్, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా ఆంద్రావతి నుంచి రికార్డు స్థాయిలో దాదాపు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో గోదావరి ప్రవాహం తీవ్రరూపం దాల్చింది. రాబోయే 24నుంచి 36 గంటల్లో మేడిగడ్డ, భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం 12 నుంచి 17 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని వరద ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. ఎస్ఆర్ఎస్పీ, ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులతో పాటు భద్రాచలం వద్ద వీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది.



## కాళేశ్వరం వద్ద ఉగ్రరూపం

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

8.35 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం

ప్రమాద స్థాయి దాటిన ప్రవాహాలు

అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు

# యువత ఉపాధి, నైపుణ్యాలపై స్పెషల్ ఫోకస్

## ఏజెంట్ల మోసాలకు చెక్.. టామ్‌కాం పర్యవేక్షణ

- విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం బాధ్యతలు విస్తరణ
- స్కిల్ యూనివర్సిటీలో విదేశీ భాషల విభాగం ఏర్పాటు
- యువతకు విదేశీ ఉపాధి అవకాశాలపై సీఎం ఫోకస్
- డ్రోన్, ఈవీ కోర్సులు ప్రారంభించాలని సీఎం సూచన
- ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యాల పెంపుపై సీఎం దృష్టి
- బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణకు స్కాలర్‌షిప్‌ల పరిశీలన
- విదేశీ ఉద్యోగ మోసాల నివారణకు టామ్‌కాం చర్యలు
- నర్సింగ్ విద్యకు ప్రోత్సాహం.. డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు
- ఈవీ, డ్రోన్ కోర్సులతో కొత్త ఉద్యోగావకాశాలు

02

ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేవారికి ప్రభుత్వ అండ



# సత్యమే గెలుస్తుంది

ఫార్ములా-ఈ కేసు.. కేటీఆర్ విచారణ ఆగస్టు 25కు వాయిదా

## కేటీఆర్‌కు పూచీకత్తు.. విచారణ వాయిదా

రాజకీయ కక్షతోనే కేసు పెట్టారన్న కేటీఆర్

సత్యమే గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్య




- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్కు కోర్టు షరతులతో బెయిల్
- ఏసీబీ కోర్టులో కేటీఆర్ హాజరు.. విచారణ వాయిదా
- కేటీఆర్ విచారణ ముగింపు.. ఆగస్టు 25న తదుపరి విచారణ
- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్కు ఊరట
- రాజకీయ కక్షతోనే కేసు పెట్టారన్న కేటీఆర్ ఆరోపణ
- తప్పుడు కేసులు పోరాటాన్ని ఆపలేవన్న కేటీఆర్
- సత్యమే గెలుస్తుందన్న కేటీఆర్.. కోర్టులో హాజరు
- కోర్టులో పూచీకత్తు సమర్పించిన కేటీఆర్, అరవింద్ కుమార్
- ఫార్ములా-ఈ కేసు.. కేటీఆర్పై విచారణ...

03

## మెటా హెడ్‌పై కేసు నమోదు..

- మెటా ఇండియా హెడ్‌పై హైదరాబాద్ సైబర్ కేసు
- మోడీ ఏఐ వీడియో వ్యవహారం.. మెటాపై కేసు నమోదు
- డీప్‌ఫేక్ వీడియోలపై మెటా, యూజర్లపై కేసులు
- ఏఐ మార్ఫింగ్ కలకలం.. మెటాపై పోలీసుల చర్యలు

05




## బీజేపీకి షెహజాద్ రాజీనామా

- ఎనిమిదేళ్ల తర్వాత బీజేపీని వీడిన షెహజాద్
- బీజేపీ అధికార ప్రతినిధి పదవికి షెహజాద్ రాజీనామా
- బీజేపీకి షెహజాద్ పూనావాలా షాక్
- షెహజాద్ పూనావాలా రాజీనామా.. కారణాలపై ఉత్కంఠ
- బీజేపీని వీడిన జాతీయ అధికార ప్రతినిధి

05



## జితేంద్రసింగ్ పై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీసు

- జితేంద్ర సింగ్‌పై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీసు
- పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- జితేంద్ర సింగ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు దాఖలు

05



# పెద్దికి కన్నీటి వీడ్కోలు



## కడసారి చూసేందుకు..

తరలివచ్చిన అభిమానులు.. కన్నీటి సంద్రంగా నర్సంపేట

ఆప్త మిత్రున్ని కోల్పోయా పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై కేసీఆర్ భావోద్వేగం

ఉద్యమంలో పెద్ది పాత్ర మరవలేనిది : సీఎం రేవంత్ రెడ్డి

- అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది జనం
- పెద్ది సుదర్శన్ స్వగ్రామంలో అంతిమ సంస్కారాలు
- ఇప్పటికే అక్కడికి చేరుకున్న కేటీఆర్, హరీష్ రావు, ఇతర ప్రముఖులు
- పెద్ది మృతిపై కేసీఆర్ తీవ్ర సంతాపం ఉద్యమ సహచరుడుని కోల్పోయా
- పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా
- తెలంగాణ ఉద్యమంలో పెద్ది సేవలను గుర్తుచేసిన కేసీఆర్

03





## సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు హైకోర్టు ఆదేశం
- కోర్టు ధిక్కరణపై హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- చట్టాన్ని అతిక్రమించిన హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు చర్య
- రంగనాథ్‌ను వెంటనే తొలగించాలని ప్రభుత్వానికి ఆదేశం

03

# పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేశాడు

## రేగా కాంతారావుపై లైంగిక వేధింపుల కేసు

- పెళ్లి హామీతో మోసం.. రేగా కాంతారావుపై యువతి ఫిర్యాదు
- రేగా కాంతారావుపై లైంగిక వేధింపుల కేసు నమోదు
- కేసు రద్దుకు హైకోర్టును ఆశ్రయించిన రేగా కాంతారావు
- యువతి ఫిర్యాదుతో మాజీ ఎమ్మెల్యేపై దర్యాప్తు ప్రారంభం
- పెళ్లి పేరుతో మోసం ఆరోపణలు.. కోర్టులో కేసు
- ఎఫ్ఐఆర్ రద్దు కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్
- రేగా పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ
- రాజకీయ కక్షతోనే కేసు నమోదైందన్న రేగా

02

ఎఫ్ఐఆర్ రద్దు కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును రద్దు (క్వాష్) చేయాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, న్యాయ-స్థానం ఈ పిటిషన్‌పై నేడు విచారణ చేపట్టనుంది. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని...



# పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేశాడు

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేపై యువతి ఫిర్యాదు.. కేసు నమోదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతా రావుపై పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించి, మోసం చేశారంటూ ఓ యువతి నాంపల్లిలోని గౌరవ XIV అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించింది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం.. ఆమె నగరంలో ఓ పీజీలో నివసిస్తూ మీడియా రంగంలో పనిచేస్తోంది. 2022లో ఓ ఇంటర్వ్యూ నిమిత్తం రేగా కాంతా రావుతో పరిచయం ఏర్పడింది. కొత్త యూట్యూబ్ ఛానల్ నిర్మాణం పేరుతో మొదలైన ఈ పరిచయం, పెళ్లి చేసుకుంటాననే హామీతో క్లోజ్ రిలేషన్‌షిప్‌గా మారింది. అమీర్‌పేటలోని ఓ ఫ్లాట్‌లో కొన్నాళ్లు సహజీవనం చేసినట్లు, ఈ క్రమంలో తన అనుమతి లేకుండా వ్యక్తిగత ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె ఆరోపించింది. అంతేకాకుండా, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని, ఆ తర్వాత నుంచి ముఖం చాటేశారని పేర్కొంది. ఆర్థిక ఇబ్బందుల సమయంలో ఈ విషయంపై ఒత్తిడి తేగా, ఆయన అనుచరుల ద్వారా కొన్ని విడతలుగా రూ.8.5 లక్షలు బదిలీ చేసినప్పటికీ, తన సమస్య కేవలం డబ్బుకు సంబంధించింది కాదని.. నాలుగేళ్ల పాటు పెళ్లి పేరుతో మోసం చేసి శారీరకంగా దోపిడీ చేయడమేనని స్పష్టం చేసింది. గతంలో షీ టీమ్స్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా, రేగా కాంతా రావు తనపై ఎదురు ఆరోపణలు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం తనకూ, తన కుటుంబానికి ఆయన అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. 2026 జూలై 26న అందిన ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బీఎన్ఎస్ (BNS) సెక్షన్ 69, 351(2) కింద ఎఫ్ఐఆర్ (FIR 589/2026) నమోదు చేసి, కేసు విచారణను ఎస్ఐపీ నరసింగరావుకు అప్పగించారు. కాగా, ఈ ఆరోపణల నిజానిజాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే రేగా**

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును రద్దు (క్వాష్) చేయాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం ఈ పిటిషన్‌పై నేడు విచారణ చేపట్టనుంది. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, రాజకీయ దురుద్దేశంతోనే కేసు నమోదు చేశారని పేర్కొంటూ ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 26న పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో రేగా కాంతారావుపై ఒక యువతి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. యూట్యూబ్ ఛానెల్ పేరుతో తనను ఫ్లాట్‌కు పిలిపించి వేధించారని, ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించారని సదరు బాధితురాలు ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయగా, ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేగా కాంతారావు ధర్మాసనాన్ని కోరడంతో, ఈ కేసుపై హైకోర్టు తీసుకోబోయే నిర్ణయం తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

# నిండు కుండలా తెలుగు రాష్ట్రాల జలాశయాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, కృష్ణా నదులు ఉప్పొంగుతున్నాయి. ప్రధాన జలాశయాలకు భారీగా వరద చేరుతుండటంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి, కడెం, మేడిగడ్డ బ్యారేజీల నుంచి భారీగా నీటిని వదులుతుండగా, భద్రాచలం, కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.

**కాళేశ్వరం దగ్గర గోదావరి ఉగ్రరూపం**

ఎగువన భారీ వర్షాలతో గోదావరి, ప్రాణహితకు భారీ వరద వచ్చింది. త్రివేణి సంగమం వద్ద నీటిమట్టం 11 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. 12.210 మీటర్లకు చేరితే తొలి ప్రమాద హెచ్చరిక జారీ కానుంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద భారీ వరద కొనసాగుతుండగా, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6,79,910 క్యూసెక్కులుగా నమోదైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 1,32,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 15 గేట్లు ఎత్తి 1,16,750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు 35,473 క్యూసెక్కుల వరద చేరడంతో 5 గేట్ల ద్వారా 46,747 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ములుగు జిల్లా పేరూరు, రామన్నగూడెం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41 అడుగులకు చేరగా, 8.12 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్**

ఆంధ్రప్రదేశ్‌లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 2.25 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 1,43,615





క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, ప్రస్తుతం ఔట్‌ఫ్లో నిలిపివేశారు. వరద పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# యువత ఉపాధి, నైపుణ్యాలపై స్పెషల్ ఫోకస్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన (శక్తి) శాఖపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎం పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని అధునాతన రీతిలో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వీలుగా యూనివర్సిటీలో ప్రత్యేక 'రీసెర్చ్ సెంటర్'ను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా, తెలంగాణ యువతకు విదేశాల్లో భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తున్న నేపథ్యంలో, దానికి అనుగుణంగా స్కిల్ యూనివర్సిటీలోనే విదేశీ భాషలు నేర్పించేందుకు ప్రత్యేక వింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు.

**ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఏటీసీల్లో ఈవీ డిమాండ్**

**కోర్సులు**

ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యంతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంచేందుకు ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అలాగే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో (ATC) మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వెహికల్ (EV) సర్వీసింగ్ కోర్సులతో పాటు 'డ్రోన్ టెక్నాలజీ' సంబంధిత కోర్సులను తక్షణమే ప్రవేశపెట్టాలని అధికారులకు సూచించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (TOMCOM) వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విదేశాలకు వెళ్లాలనుకునే నిరుద్యోగ యువతకు పాస్‌పోర్ట్ ఇప్పించే ప్రక్రియ నుంచి మొదలుకొని, విదేశీ కంపెనీల్లో సరైన ఉద్యోగాలు సాధించే వరకు అన్ని బాధ్యతలను టామ్‌కామ్‌యే దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. దీనితో పాటు, అంతర్జాతీయంగా రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కొత్త నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు తగిన అనుమతులు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

# రేషన్ కార్డుదారులకు ఊరట

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సూపర్ ఎల్‌నినో ప్రభావం కారణం కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్నవారికి మూడు నెలల బియ్యం ఒకేసారి ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలతో పాటు బియ్యాన్ని పంపిణీ చేసింది. ఈ క్రమంలో రేషన్ కార్డు ఈ కేవైసీ ఈ రోజుతో ముగియగా.. ఇప్పటి వరకు వివిధ కారణాలతో కేవైసీ పూర్తి చేసుకొని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊరట కలిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నాయి. రేషన్ కార్డుల ఈ-కేవైసీ నమోదు గడువు ముగియడంతో, ఆ గడువును ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. తొలుత జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించినప్పటికీ, ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేసింది. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ కొనసాగుతుండటం, పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ గడువును పెంచినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ-కేవైసీ ప్రక్రియతో సంబంధం లేకుండానే రేపటి నుంచి ఒక్కో కార్డుదారునికి మూడు నెలల రేషన్ సరుకులను ఒకేసారి పంపిణీ చేయనున్నారు. గడువు పొడిగింపు వల్ల ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని లబ్ధిదారులు ఆగస్టు 31 వరకు సమీప రేషన్ డీలర్ వద్ద ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని, రేషన్ పంపిణీకి ఈ-కేవైసీ అడ్డంకి కాదని అధికారులు స్పష్టం చేశారు.

# నాపై కావాలనే కుట్ర..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తనకు నెల రోజుల జైలు శిక్ష పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై హైదరాబాద్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. తనపై జరుగుతున్నది పూర్తిగా తప్పుడు ప్రచారమని, అందులో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు తెలంగాణ హైకోర్టు నెల రోజుల జైలు శిక్ష విధించిందంటూ నెట్టింట వైరల్ అవుతున్న వార్తలను ఏవీ రంగనాథ్ తీవ్రంగా ఖండించారు. "నేను ఊహించినట్లుగానే కొందరు కావాలని సోషల్ మీడియా వేదికగా నాపై తప్పుడు వార్తలను వ్యాప్తి చేస్తున్నారు. ఇవన్నీ అసత్య ప్రచారాలు మాత్రమే" అని ఆయన పేర్కొన్నారు.

**అధికారిక సమాచారాన్నే నమ్మండి..**

సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న ఫేక్ న్యూస్‌లను ప్రజలు, మీడియా ప్రతినిధులు ఎవరూ నమ్మవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ విజ్ఞప్తి చేశారు. ఏదైనా అంశానికి సంబంధించి కేవలం అధికారిక మూలాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన సూచించారు.










# అద్దె ఇళ్ల బాధితులకు ఊరట

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అద్దె ఇళ్లలో నివాసముంటూ,కుటుంబ సభ్యుల మరణంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మానవతా దృక్పథంతో ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలోని హిందూ స్మశానవాటికలో రైస్ మిల్లర్ల సహకారంతో ప్రత్యేకంగా రెండు గృహాలను నిర్మించనున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశారు. శుక్రవారం మిర్యాలగూడ హిందూ స్మశానవాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. అద్దె ఇళ్లలో ఉంటున్న కుటుంబాల్లో ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే ఇల్లు కీడు అవుతుందనే అంధవిశ్వాసాలతో యజమానులు మృతదేహాన్ని ఇంట్లోకి అనుమతించని సంఘటనలు ఇటీవల ఎంతోమందిని కలచివేశాయి. కన్నవారిని,కట్టుకున్నవారిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలు,శవాన్ని రోడ్డుపై పెట్టుకుని నరకయాతన అనుభవించిన దయనీయ పరిస్థితులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇలాంటి మానవీయ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే తపనతోనే స్మశానవాటిక ఆవరణలోనే రెండు సకల సౌకర్యాలతో కూడిన గృహాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు బిఎల్ఆర్ తెలిపారు. మృతదేహాన్ని రోడ్లపై లేదా అనాథగా ఉంచాల్సిన అవసరం లేకుండా,అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు గౌరవప్రదంగా ఈ గృహాలలో ఉండవచ్చన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులు,బంధువులు వేచి ఉండటానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఈ ఇళ్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సామాజిక దృక్పథంతో కూడిన నిర్మాణానికి స్థానిక రైస్ మిల్లర్ల సహకారాన్ని సమీకరించి,త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్మశానవాటికలో విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను వెంటనే తొలగించి, ఆవరణను ఎప్పటికప్పుడు అద్దంలా శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను తీవ్రంగా ఆదేశించారు. స్మశానవాటికను అన్ని సౌకర్యాలతో వైకుంఠధామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.




# ఢిల్లీలో దీక్ష చేసే ధైర్యం ఉందా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో విద్యాశాఖ మంత్రి పదవిని 'జెన్-జీ' (Gen-Z) తరానికి ఇవ్వాలంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న డిమాండ్‌పై కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ అగ్ర నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నేతలకు జెన్-జీ యువతపై నిజంగానే అంత ప్రేమ, ప్రాధాన్యత ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు వెళ్లి దీక్ష చేపట్టాలని సామ రామ్మోహన్ రెడ్డి సవాల్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేసేవరకు ఆ దీక్షను విరమించకూడదని డిమాండ్ చేశారు.

**విరమిస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ఒప్పుకోవాలి..**

ఒకవేళ ఆ రకంగా దీక్ష చేయకుండా మధ్యలోనే విరమిస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒకటేనని జెన్-జీ యువత ముందు బహిరంగంగా ఒప్పుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయం కోసమే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి నాటకాలాడుతున్నారని సామ రామ్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. అంతేగాకుండా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యాశాఖ ఎదుర్కొన్న సమస్యలను, నిరుద్యోగ యువత పడిన ఇబ్బందులను ఈ సందర్భంగా సామ రామ్మోహన్ రెడ్డి గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యువత ప్రాతినిధ్యం గురించి మాట్లాడని నాయకులు, ఇప్పుడు విపక్షంలోకి రాగానే 'జెన్-జీ' అంటూ కొత్త నాటకాలకు తెరతీశారని మండిపడ్డారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# పెద్దికి కన్నీటి వీడ్కోలు

**దుగ్గొండి,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు నర్సంపేటకు తరలివచ్చారు. దుగ్గొండి మండలం గిర్నిబావి శివారు నుంచి కొనసాగిన అంతిమయాత్రలో ఊరూరా ప్రజలు రహదారులపైకి వచ్చి పార్థివదేహానికి కన్నీటి నివాళులర్పిం చారు. ప్రియతమ నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా శోకసంద్రంగా మారింది. అభిమానుల రద్దీ కారణంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణానికి సంతాప సూచకంగా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాసం స్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. వ్యాపారులు దుకాణాలు మూసివేసి, నల్ల బ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు. అంతకుముందు హనుమకొండలోని అమరవీ రుల స్తూపం వద్ద ఉంచిన పెద్ది పార్థివదేహానికి మాజీ ప్రజాప్రతినిధులు వినయ్ భాస్కర్, శంకర్ నాయక్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఉద్యమకారులు ఘనంగా అశ్రునివాళులు అర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియల ప్రక్రియ పూర్తయింది. ఈ అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ సహచర నేతకు వీడ్కోలు పలికారు.

**ఉద్యమంలో పెద్ది పాత్ర మరవలేనిది : సీఎం రేవంత్ రెడ్డి**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనీ యాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరా లని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుం బ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలి యజేశారు.

**పలువురు మంత్రుల సంతాపం**

పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికంగా దూరం కావడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని రోడ్లు, భవ నాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరి ష్కారానికి అంకితభావంతో పనిచేసిననాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి నిలిచిపో తారని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన గొప్ప నాయకుడిని కోల్పోయా మని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సం తాపం తెలిపారు. గుండెపోటుతో చికిత్స పొందుతూ పెద్ది మృతి చెందడం అత్యంత విషాదకరమని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేసిన నాయకుడని మంత్రి దామోదర్ రాజ నర్సింహ స్మరించుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పెద్ది సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సంతాపం**

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణవార్త తీవ్రంగా కల చివేసిందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని, శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.

**ప్రజా సేవలో చురుకైన నాయకుడిగా..**

నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, రోడ్లు, తాగునీరు, వ్యవసాయ సమస్యలు, కరోనా కాలంలో సహాయక చర్యలు వంటి అంశాలపై దృష్టి సారించారు. ప్రజా సేవలో చురుకైన నాయకుడిగా, పార్టీ శ్రేణుల్లో, సాధారణ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఆయన మరణంతో బీఆర్ఎస్ శ్రేణులు, నర్సంపేట ప్రాంత ప్రజలు, తెలంగాణ రాజకీయ వర్గాలు విషాదంలో మునిగిపోయాయి. తెలంగాణ ఉద్యమం నుంచి అసెంబ్లీ వరకు ప్రజా సేవ చేసిన సుదర్శన్ రెడ్డి జ్ఞాపకాలు నిలిచిపోతాయి.

**బాల్యంజీవితం, రాజకీయ ప్రస్థానం**

వరంగల్ గ్రామీణ జిల్లా నల్లబెల్లి గ్రామంలో 1974 ఆగస్టు 6న వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అనంతరం 2001లో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి మలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించారు. వరంగల్ 1 ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, జెడ్పీటీసీగా సేవలందిస్తూ వరంగల్ కేంద్రం గా జరిగిన సభలు, మహాగర్జనల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 2018-2023 కాలంలో తెలంగాణ పౌర సరఫరాల సంస్థ చైర్మన్ గా, అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా బాధ్యత లు నిర్వర్తించి నియో జకవర్గ అభివృద్ధికి, ప్రజారోగ్యానికి విశేష కృషి చేశారు.

**పెద్ది సేవలు మరువలేనివి : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నా రని, నర్సంపేట నియోజకవర్గ ప్రాంత ప్రజలకు ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేని పని మంత్రి కొనియాడారు. ఎమ్మెల్యేగా ఎన్నికై నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షే మానికి పెద్ది సుదర్శన్ రెడ్డి నిరంతరం కృషి చేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకు న్నారు. ఆయన అకాల మరణం ఎంతో బాధాకర మని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమాను లకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**ఆప్త మిత్రుడిని కోల్పోయా : కేసీఆర్ భావోద్వేగం**

ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్రెడ్డి మృతిపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తీవ్ర ది గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిం దని తెలిపారు. తానొక ఆప్త మిత్రుణ్ని. ఉద్యమ సహచరుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది కుటుంబసభ్యులకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్ద కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేసీఆర్ భరో సా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పిలుపుని చ్చారు. పెద్దిని కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన కృషి ఫలించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ పరిణామం తనకు తీవ్ర మనోవేదన కలిగించిందని పేర్కొన్నారు.

**నిజాయితీతో ప్రజా జీవనాన్ని కొనసాగించారు..**

తెలంగాణనే శ్వాసగా భావించి నీతి, నిజాయతీతో ప్రజా జీవితాన్ని కొనసాగించిన నాయకుడు పెద్ది సుదర్శన్రెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. పోరాటాల గడ్డ ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన ధీరుడని చెప్పారు. ఉద్యమ కాలం నుంచి చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే ఆయన రాజకీయ ప్రస్థానం సాగిందని గుర్తు చేశారు. ఉద్యమంలోనూ, నియోజకవర్గ అభివృద్ధిలోనూ పెద్ది తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కేసీఆర్ అన్నారు. పార్టీపట్ల అత్యంత విధేయతతో పనిచేసిన నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. సుదర్శన్రెడ్డి మరణం బీఆర్ఎస్కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణకు తీరని లోటు : ఎమ్మెల్సీ కవిత**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మృతి పట్ల బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా, స్వరాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో అలుపెరగక శ్రమించిన ఒక ఆత్మీయుడిని, ఉద్యమ సహచరు దీని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయం, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి నడిచిన పాత జ్ఞాపకాలను ఈ సందర్భంగా



కవిత గుర్తుచే సుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో కష్టనష్టాలను తట్టుకుని, కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలను చైతన్యపరచడంలో ఆయన చూపిన చొరవ, అందించిన సేవలు ఎప్పటికీ చిర స్మరణీయమని కొనియాడారు ప్రజల మనిషిగా నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుడిని కోల్పోవడం పూడ్చలేని లోటని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు, నర్సంపేట ప్రజలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో పెద్ది కుటుంబానికి పార్టీ సర్వవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**పెద్ది మరణంతో.. విషాదంలో బీఆర్ఎస్ శ్రేణులు**

తెలంగాణ ఉద్యమ సహచరుడు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో బీఆర్ఎస్ పార్టీ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ, ఆ తర్వాత పార్టీ అభివృద్ధిలోనూ తమతో కలిసి నడిచిన ఉద్యమ నేత మృతి చెందడం పార్టీకి, రాష్ట్రానికి తీరని లోటని గులాబీ శ్రేణులు కన్నీటి పర్యంతమ య్యారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నేతలు ఘనంగా నివాళులర్పించారు.

**పెద్ది మరణం ఎంతో బాధాకరం: కేటీఆర్**

నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గుర్తి చేసిందని బీఆర్ఎస్ నర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి వస్తారని ఆశించామని, కానీ ఆయన ఇకలేరనే వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో, పార్టీ బలోపేతంలో ఆయన అందించిన సేవలు మరవలేనివని పేర్కొన్నారు.

**మనసున్న మనిషి: హరీశ్ రావు**

ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసేందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మృత్యువును జయించి తిరిగి వస్తారనే నమ్మకంతో అంతా ఎదురుచూశామని, ఈ విషాద వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**మిత్రుడిని కోల్పోయా: తలసాని శ్రీనివాస్ యాదవ్**

పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తీవ్ర బాధాకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సుదర్శన్ రెడ్డి మరణంతో తాను ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని చెపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.

**ప్రగాఢ సానుభూతి తెలిపిన వేముల ప్రశాంత్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తొలినాటి నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట నిబద్ధతతో నడిచిన ఉద్యమ సహచరుడిని కోల్పోవడం కలిచివేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

# సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కోర్టు ఉత్తర్వులు, ఇచ్చిన హామీలను ఉల్లంఘించినందుకు గాను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్ట పాలనను అతిక్రమించినందుకు ఆయనను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలని, ఆయన స్థానంలో మరొక అర్హులైన అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని వివాదాస్పద 40 ఎకరాల స్థలానికి సంబంధించి "శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్" దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది.

**చట్టానికి ఎవ్వరూ అతీతులు కారు : హైకోర్టు**

గతంలో సదరు భూమి ప్రైవేటు ఆస్తి అని సివిల్ కోర్టు, హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. ఆ ఆస్తిలోకి తాము గానీ, తమ సిబ్బంది గానీ ప్రవేశించబోమని, ఎటువంటి జోక్యం చేసుకోబోమని హైడ్రా కౌన్సిల్ గతంలో కోర్టుకు లిఖితపూర్వక హామీ ఇచ్చిందని తెలిపింది. అయినప్పటికీ ఆ హామీని తోసిపుచ్చి అధికారులు, భారీ పోలీసు బలగాలు, జేసీబీలతో సదరు స్థలంలోకి ప్రవేశించి తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేయడం కోర్టు ఉత్తర్వులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, గ్రీకు పురాణాల్లోని 'హైడ్రా' అనే రాక్షస సర్పం తనకు తిరుగులేదని భావించినట్లే, తెలంగాణ హైడ్రా కూడా చట్టానికి అతీతులమని భావించకూడదని హితవు పలికింది. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని, కోర్టు ఒత్తిడి పెరిగిన తర్వాతే సమర్పించే అఫిడవిట్ క్షమాపణలను అంగీకరించలేమని పేర్కొంది. "వ్యక్తుల పాలన కాదు... చట్ట పాలనే నడవాలి" అని స్పష్టం చేస్తూ, రంగనాథ్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి, ఆయన స్థానంలో మరో అర్హులైన అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేసింది.

# వర్షాలు రావద్దని క్షుద్రపూజలు చేశారు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి హరీష్ రావుపై ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రాజకీయ అరాచకం పతాక స్థాయికి చేరుకుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై వ్యతిరేఖత తీసుకువచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారని అన్నారు. చివరికి క్షుద్రపూజలు చేసి వానలను అడ్డుకోవాలని, రాష్ట్రానికి నష్టం జరగాలని చూస్తున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లి పూజలు చేస్తున్నాడో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని శివమొగ్గ, తిరుచ్చిలో హరీష్ రావు పూజలు చేయించారని అన్నారు. శివమొగ్గ తాంత్రిక పూజలకు ప్రసిద్ధం చెందినదని వ్యాఖ్యానించారు. ఇలా పూజలు చేయించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. వర్షాలు రాకపోతే సమస్యలు వస్తాయని, ప్రభుత్వంపై వ్యతిరేక వస్తుందని అందుకే పూజలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చేందుకు సోషల్ మీడియాను వినియోగిస్తున్నారని అది సరిపోక తాంత్రిక పూజలు చేయిస్తున్నారని అన్నారు. క్షుద్రపూజలపై హరీష్ రావు సమాధానం చెప్పాలని అన్నారు. అధికారం లేకపోతే బీఆర్ఎస్ నేతలు అఘోరాలుగా తయారవుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు నష్టం జరగాలని కోరుకోవడం దారుణం అని అన్నారు.

# సత్యమే గెలుస్తుంది

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సంచలనం సృష్టించిన 'ఫార్ములా-ఈ కార్ రేసు' వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న ఆయనకు న్యాయస్థానం రూ. లక్ష పూచీకత్తు, ఇద్దరు వ్యక్తులతో షూరిటీ సమర్పించాలని ఆదేశించింది. కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి కూడా కోర్టులో పూచీకత్తు సమర్పించారు. అనంతరం కోర్టు తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది.

**ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం..**

నిబంధనలకు విరుద్ధంగా యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆర్గనైజేషన్ (ఫీజూ)'కు నిధులు మళ్లించారనే ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు జరిపి, మార్చి 23న 77 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇందులో 14 మంది సాక్షులను పేర్కొంటూ, కేటీఆర్‌తో సహా ఐదుగురిపై అభియోగాలు మోపింది. కోర్టు ఈ ఛార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నిందితులు తొలిసారిగా కోర్టుకు హాజరయ్యారు.

**ఏసీబీ అభియోగాలు:**

క్యాబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారు. సంతకం చేసే అధికారం లేకపోయినా నిబంధనలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి హెచ్ఎండీఏ ద్వారా సుమారు రూ. 75.88 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారు. దీనివల్ల ప్రభుత్వానికి నష్టం, ప్రైవేటు సంస్థలకు లాభం చేకూరింది. రాబోయే సీజన్లకు గాను ప్రభుత్వంపై రూ. 600 కోట్ల భారం పడేలా ఒప్పందాలు చేశారు. దీనికి ప్రతిఫలంగా పార్టీకి రూ. 44 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల విరాళాలు అందాయి.

**కేటీఆర్ వాదన..**

ఇది వ్యక్తిగత నిర్ణయం కాదు, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి వేదికగా నిలపాలన్న ఉద్దేశ్యంతో అప్పటి ప్రభుత్వం సమిష్టిగా తీసుకున్న నిర్ణయం. రేసును ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడం వల్లే రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిన్నది. నిర్ణయాల్లో అధికారుల, నిపుణుల పాత్ర కూడా ఉంది. అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను నేరాలుగా చిత్రీకరిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాపై అక్రమ కేసులు బనాయించారు.

**తప్పుడు కేసులు మా పోరాటాన్ని ఆపలేవు: కేటీఆర్**

కోర్టు విచారణకు ముందు కేటీఆర్ ఫేస్‌బుక్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'కుట్రపూరితంగా బనాయించిన ఈ తప్పుడు కేసులు ప్రజల తరఫున మేం చేసే పోరాటాన్ని ఆపలేవు. అంతిమంగా సత్యమే గెలుస్తుంది' అని స్పష్టం చేశారు. కోర్టు ప్రక్రియ ముగిసిన తర్వాత, ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కేటీఆర్ నర్సంపేటకు బయలుదేరి వెళ్లినట్లు పార్టీ వర్గాల సమాచారం.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య,పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ,పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌తో కలిసి పాఠశాలలోని విద్యా బోధన,మౌలిక వసతులు,పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమైన ఎమ్మెల్యే వారి విద్యాభ్యాసం, ఎదురవుతున్న సమస్యలు, పాఠశాలలో అందిస్తున్న ఆహార నాణ్యత,ఫుడ్ మెనూ తదితర అంశాలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి,వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన,పోషకాహారంతో కూడిన భోజనాన్ని ప్రతిరోజూ అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.మంచి విద్యతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కల్పనకు నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరోసారి ఎస్ఐఆర్ గడువు పెంపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో మరోసారి SIR గడువును పెంచుతూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 10వ తేదీ వరకూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువును పెంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఎన్యుమరేషన్ ఫార్మ్ సబ్మిట్ చేయని ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తొలుత జూలై 24వ తేదీతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) గడువు ముగుస్తుందనగా.. కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువును ఆగస్టు 3వ తేదీకి పొడిగించింది. 3న రేషనలైజేషన్, పోలింగ్ స్టేషన్స్ రీ అరేంజ్మెంట్ చేయాలని ఆదేశించింది. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల, క్లెయిమ్స్, అభ్యంతరాలను ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 లోపు చేపట్టాలని తెలిపింది.




అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని ప్రకటించింది. కానీ.. ఆగస్టు 3లోగా మొత్తం ఓటర్ల సమగ్ర సవరణకు గడువు సరిపోదని, మరోసారి గడువు పెంచాలని వినతులు రావడంతో ఆగస్టు 10వ తేదీ వరకూ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పెంచింది.

# సంపాదకీయం



# ఆచరణలో సాధ్యమేనా?

భారత ప్రజాస్వామ్యం మరో కీలక చర్చకు వేదికైంది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదన రాజకీయ, రాజ్యాంగ, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. దేశ జనాభాలో సగానికి పైగా యువతే ఉన్న నేపథ్యంలో వారికి రాజకీయాల్లో మరింత భాగస్వామ్యం కల్పించాలన్న ఆలోచన సహజంగానే ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అయితే ప్రజాస్వామ్యంలో ప్రతి సంస్కరణను భావోద్వేగాలతో కాకుండా, దీర్ఘకాలిక ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని పరిశీలించాల్సిన అవసరం ఉంది. యువతకు అవకాశాలు పెంచడం ఎంత ముఖ్యమో, ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను కాపాడటం కూడా అంతే అవసరం. ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు ఉంది. అయితే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీసం 25 ఏళ్లు నిండి ఉండాలి. రాజ్యసభ, శాసన మండలులకు ఈ పరిమితి 30 సంవత్సరాలు. ఓటు వేసే హక్కు ఉన్న వ్యక్తికి ప్రజాప్రతినిధిగా పోటీ చేసే అవకాశం మరో ఏడు సంవత్సరాల తర్వాత మాత్రమే లభించడం సమంజసమేనా అనే ప్రశ్న చాలాకాలంగా వినిపిస్తోంది. అదే ప్రశ్న ఇప్పుడు మరోసారి జాతీయ చర్చగా మారింది. ఈ ప్రతిపాదనకు మద్దతుదారులు చెప్పే ప్రధాన వాదన స్పష్టంగా ఉంది. నేటి యువత గత తరాలతో పోలిస్తే విద్య, సాంకేతిక పరిజ్ఞానం, సమాచార ప్రాప్తి, ప్రపంచ పరిణామాల అవగాహనలో ఎంతో ముందుంది. డిజిటల్ యుగంలో పెరిగిన తరం దేశ ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్‌లు, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి సమకాలీన అంశాలపై కొత్త దృక్పథాన్ని కలిగి ఉంది. అలాంటి యువతకు విధాన రూపకల్పనలో ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పిస్తే పాలన మరింత సమకాలీనంగా మారుతుందని వారి అభిప్రాయం. ప్రపంచంలోని అనేక ప్రజాస్వామ్య దేశాలు ఇప్పటికే తక్కువ వయస్సులోనే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఇది యువత రాజకీయ సామర్థ్యంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం. భారతదేశం కూడా ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశంగా నిలుస్తున్న సమయంలో రాజకీయ వ్యవస్థలో ఆ వాస్తవం ప్రతిబింబించాలన్న అభిప్రాయం బలపడుతోంది. యువత సమస్యలను యువ నాయకులు మరింత దగ్గరగా అర్థం చేసుకోగలరని, ఉపాధి, విద్య, సాంకేతికత, డిజిటల్ పాలన వంటి రంగాల్లో వారి సూచనలు విధానాలను మరింత ప్రభావవంతంగా మార్చగలవని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మరోవైపు కొన్ని సహేతుకమైన సందేహాలు కూడా ఉన్నాయి. ప్రజాప్రతినిధి పదవి కేవలం ఉత్సాహం లేదా ప్రజాదరణతో నడిచేది కాదు. చట్టాల రూపకల్పన, బడ్జెట్ చర్చలు, పరిపాలనపై పర్యవేక్షణ, రాజ్యాంగ పరిరక్షణ వంటి బాధ్యతలు అత్యంత పరిణతి, సహనం, అనుభవాన్ని కోరుకుంటాయి. రాజకీయ నిర్ణయాలు కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసాయి. అందువల్ల కనీస వయోపరిమితి వెనుక ఉన్న ఉద్దేశాన్ని పూర్తిగా విస్మరించలేం. అయితే అనుభవానికి వయస్సే కొలమానం కాదన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. 21 ఏళ్లకే సామాజిక ఉద్యమాలు నడిపిన వారు ఉన్నారు. స్థానిక సంస్థల్లో సమర్థవంతంగా పనిచేసిన యువ నాయకులు ఉన్నారు. మరోవైపు 40, 50 ఏళ్ల వయస్సులో కూడా ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా రాజకీయాల్లో కొనసాగుతున్న వారూ ఉన్నారు. కాబట్టి నాయకత్వానికి వయస్సు ఒక ప్రమాణమే తప్ప ఏకైక ప్రమాణం కాదని గుర్తించాలి. ఇక్కడ మరో కీలక అంశాన్ని విస్మరించరాదు. వయస్సు తగ్గించడం వల్ల నిజంగా సాధారణ యువతకు అవకాశాలు పెరుగుతాయా? లేక రాజకీయ కుటుంబాలకు చెందిన యువ వారసుల ప్రవేశం మరింత వేగవంతమవుతుందా? భారత రాజకీయాల్లో కుటుంబ ఆధిపత్యం, ధనబలం, కుల సమీకరణలు ఇప్పటికీ అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో చట్టం మారినా రాజకీయ సంస్కృతి మారకపోతే ఆశించిన ఫలితాలు రావడం కష్టమే. అందుకే వయోపరిమితి తగ్గింపుతో పాటు రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం బలోపేతం కావాలి. యువతకు టికెట్ల కేటాయింపులో పారదర్శక విధానాలు ఉండాలి. స్థానిక సంస్థల నుంచి శాసనసభల వరకు యువ నాయకత్వాన్ని క్రమంగా తీర్చిదిద్దే వ్యవస్థ అవసరం. విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిజ్ఞానం, ప్రజా విధానాలపై శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత రాజకీయాల్లోకి రావడం అంటే కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే కాదు; బాధ్యతాయుతమైన ప్రజా నాయకత్వాన్ని నిర్మించడం కూడా. ఇంకో ముఖ్యమైన అంశం ఓటర్ల దృక్పథం. ప్రజాస్వామ్యంలో చివరి నిర్ణయం ప్రజలదే. అభ్యర్థి వయస్సు కంటే సామర్థ్యం, నిజాయితీ, ప్రజా సేవ పట్ల నిబద్ధత, విజన్‌ను ప్రజలు ప్రాముఖ్యంగా పరిగణిస్తే రాజకీయ వ్యవస్థ సహజంగానే మారుతుంది. ప్రజలు మెరుగైన నాయకత్వాన్ని ఎన్నుకునే సంస్కృతి బలపడితే యువతకు కూడా అవకాశాలు పెరుగుతాయి. ప్రజాస్వామ్యం నిరంతరం పరిణామం చెందే వ్యవస్థ. కాలానుగుణ మార్పులను అది స్వీకరించాల్సిందే. అయితే ప్రతి సంస్కరణ లక్ష్యం కేవలం కొత్త అవకాశాలు కల్పించడం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య నాణ్యతను పెంచడం కావాలి. 21 ఏళ్లకే చట్టసభల్లోకి ప్రవేశానికి అవకాశం కల్పించడం యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచే ముందడుగు కావచ్చు. కానీ దానితోపాటు రాజకీయ సంస్కృతి, పార్టీల పని తీరు, నాయకత్వ శిక్షణ, పారదర్శక అభ్యర్థుల ఎంపిక వంటి అంశాల్లో కూడా సమాంతర సంస్కరణలు జరిగితేనే ఆ నిర్ణయం సార్థకమవుతుంది. చివరికి ప్రశ్న వయస్సు గురించినది కాదు... అర్హత, బాధ్యత, ప్రజాస్వామ్య నిబద్ధత గురించినది. 21 ఏళ్ల యువకుడు దేశాన్ని నడిపే సామర్థ్యం చూపగలిగితే ప్రజాస్వామ్యం అతనికి అవకాశం ఇవ్వడంలో తప్పు లేదు. అదే సమయంలో ఆ అవకాశాన్ని సమర్థంగా వినియోగించే రాజకీయ వాతావరణాన్ని నిర్మించడం ప్రభుత్వాల, రాజకీయ పార్టీల, సమాజం, ఓటర్ల ఉమ్మడి బాధ్యత. అవకాశానికి బాధ్యత జతకలిసినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

అదే ఈ చర్చ అందించే అసలు సందేశం.




# యువత చుట్టూ రాజకీయం

దేశంలో ఏ మార్పు అయినా యువతకే సాధ్యమౌతుంది. స్వాతంత్రోద్యమ కాలం నుంచీ కాలానుగుణంగా యువత కదం తొక్కుతూనే ఉంది. తిరుగులేని పోరాటాలతో ఎప్పటికప్పుడు అనుకున్నది సాధించుకుంటూ వస్తోంది. కాకపోతే ప్రైవేటీకరణ తర్వాత కెరీర్‌పై ఫోకస్ పెట్టి.. ఉద్యమాలకు కాస్త విరామం ఇచ్చింది. దీంతో సంప్రదాయ పార్టీలన్నీ విద్యార్థి విభాగాలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవం. అందుకే కొన్నాళ్లుగా ఎన్నికల మ్యానిఫెస్టోల్లోనూ యువతకు సంబంధించిన అంశాలు అలంకారప్రాయంగానే కనిపిస్తున్నాయి. వాటి అమలు గురించి నిలదీసేవారు లేకపోవడం లోటుగానే ఉంది. సరిగ్గా ఇలాంటి సమయంలో నీట్ లీకేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థుల నిరసన.. అన్ని పార్టీల్నీ అప్రమత్తం చేసింది. యువతలో ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉందని.. పోరాటాలకు గ్యాప్ వచ్చిందే కానీ.. పోరాటం చేసే స్వభావంలో ఎలాంటి తేడా లేదని రుజువు చేసింది. అంతేకాదు దేశంలో ఇకపై రాజకీయం ఎలా నడవాలో తామే నిర్దేశిస్తామన్న సంకేతాలు కూడా ఇచ్చింది. ఇక్కడ విద్యార్థి ఉద్యమాన్ని చూసే కోణంలో క్లారిటీ చాలా అవసరం. ఇదేదో నీట్ లీకేజ్‌కు వ్యతిరేకంగా వచ్చిన నిరసనగా పైకి కనిపిస్తున్నా.. నిజానికి అంతకు మించిన కారణాలున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. దేశంలో నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం, వ్యవస్థల నిర్లక్ష్యం.. లాంటి సమస్యలతో యువత విసిగిపోయి ఉన్నారు. అలాగే సంప్రదాయ పార్టీలు హామీలివ్వడమే కానీ.. ఎలాంటి మార్పూ తేవడం లేదని కూడా ఫిక్స్ అయ్యారు. అంతేకాదు ఈ ఉద్యమానికి చాలా ముందే తమిళనాడులో జరిగిన ఎన్నికలు, అక్కడ విజయ్ గెలుపు జెన్‌జీ ఆలోచనావిధానాన్ని స్పష్టంగా ఆవిష్కరించాయి. అప్పటికీ మేధావులు, మీడియా మొత్తం విజయ్ అనుకూలతల గురించే ఎక్కువ ప్రచారం చేసింది. కానీ విజయ్ గెలుపుకు కీలకంగా మారిన ఏకీకృతమైన యువత ఓటుబ్యాంకు గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడిప్పుడే ఢిల్లీ ఉద్యమ విజయం తర్వాత కొందరు తీరిగ్గా విజయ్ గెలుపును తాజాగా విశ్లేషించే పనిలో పడ్డారు. ఈ పరిశీలనలో ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగుచూశాయి. తమిళనాడులో ఆరు దశాబ్దాలుగా ద్రవిడ రాజకీయం, రెండు పార్టీల కాలం చెల్లిన విధానాలు చూసి విసిగిన అక్కడి యువత.. అధిక శాతం విజయ్‌కు ఓటేసింది. దీంతో టీవీకే విజయం సాధించగలిగింది. దళపతి సీఎం కాగలిగారు. కానీ ఆ విషయాన్ని సరైన సమయంలో గ్రహించడంలో పార్టీలు, విశ్లేషకులతో పాటు మీడియా కూడా విఫలమైందనేది నిజం. ఏతావాతా చాన్నాళ్లుగా గూడుకట్టుకున్న అసంతృప్తి, ఆగ్రహమే యువత తీవ్రంగా స్పందించటానికి దారితీశాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దీనికితోడు పార్టీలు కూడా యువత అంటే లెక్కలేకుండా వ్యవహరించడం కూడా వారిని ఆలోచనలో పడేసింది. దీనికి నీట్ లీకేజ్ రూపంలో సరైన ప్రాతిపదిక దొరకడంతో.. ఇక జెన్‌జీ వెల్లువను ఆపడం ఎవ్వరి తరం కాలేదు. హస్తినకు వచ్చిన యువత కేవలం నిరసనలకే పరిమితం కాలేదు. వారు తమ ఆలోచనల్ని దేశ ప్రజలతో పంచుకున్నారు. అసలు మన దేశంలో ఎలా ఉండాలని రాజ్యాంగం నిర్దేశించిందో.. ప్రస్తుత వ్యవస్థను మార్చటానికి ఏం చేయాలో కూడా చెప్పేసింది. ఏకంగా పాఠ్యపుస్తకాల్లో ఉన్న వివరాలు చదివి వినిపిస్తూ.. యువత ఉదాహరణలతో సహా చెబుతుంటే.. దేశ ప్రజలంతా భావితరం ఆలోచనలకు తెగ ముచ్చట పడిపోయారు. ఈ పరిణామం సంప్రదాయ పార్టీలపై మరింత ఒత్తిడి పెంచింది. యువత చేసిన వీడియోలతో.. చాలా మంది ప్రజలకు రాజకీయ నేతలు చెప్పేవి అవాస్తవాలని, ఇప్పటికీ దేశాన్ని బాగుచేయడం సాధ్యమేనన్న వాదనలో బలం ఉందని తెలిసింది. దీంతో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా జనమంతా యువత వెనుక నిలకబడి.. వారి డిమాండ్లు తీర్చాలని గట్టిగా చెప్పారు. అందుకే వీరిని ఇలాగే వదిలేస్తే.. ఇంకా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారాల్ని కూడా డిమాండ్ చేయొచ్చనే భయమే రాజకీయ వ్యవస్థలో కదలిక వచ్చేలా చేసింది. అలాగని ప్రతిపక్షాల్నీ యువత వదల్లేదు. ప్రజాసమస్యలపై పోరాడాల్సిన కర్తవ్యాన్ని విస్మరించినందుకు శిక్షగా తమ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన యువత.. తమ పోరాటం ఏ పార్టీకీ వ్యతిరేకం కాదని.. సరికొత్త రాజకీయం కోసమేనని ఎలుగెత్తి చాటింది. దీంతో కాస్త ఆలస్యమైనా.. జెన్‌జీ తమ పోరాట స్ఫూర్తితో.. నేతల కళ్లు తెరిపించారని దేశ ప్రజలందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు. తరం మారుతున్నకొద్దీ ఆలోచనల్లో మార్పులు రావడం సహజం. అందుకే యువతే దేశ భవిత అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ఇందుకు అనుగుణంగా తొలినాళ్ల నుంచీ యువతను మచ్చిక చేసుకుంటూ వచ్చిన పార్టీలు.. అడపాదడపా వారి డిమాండ్లు కూడా నెరవేరుస్తూ వచ్చాయి. కానీ ఇటీవలి కాలంలో ఐటీ ఉద్యోగాల్ని యువతకు ఎరేసి.. వారిని సైలెంట్ చేయగలిగామని సంతోషపడుతున్న సంప్రదాయ పార్టీల్ని ఢిల్లీ ఉద్యమం ఉలిక్కిపడేలా చేసింది. ఇకపై యువతను మభ్యపెట్టడం కుదిరే విషయం కాదని, ఇప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్తు ఉండదనే ఎరుక దాదాపుగా ప్రతి పార్టీకీ వచ్చినట్టే కనిపిస్తోంది. అందుకే ఎవరి శక్తి మేరకు వారు యువత కేంద్రంగా రాజకీయాలు చేయటానికి పూనుకుంటున్నారు. గతంలోనూ దేశంలో యువత ఉద్యమాలు చేశారు. డిమాండ్లు సాధించుకున్నారు. అప్పట్లో సమస్యలపై గళమెత్తినా.. పరిష్కారాలు ప్రభుత్వాలకే వదిలేసే పోకడ ఉండేది. కానీ జెన్‌జీ మాత్రం సర్కారుకు ఆ ఛాన్స్ కూడా ఇవ్వట్లేదు. ప్రస్తుతం వ్యవస్థలో ఎక్కడ తప్పు జరుగుతుందో చెప్పడంతో పాటు.. ఏం చేస్తే సరైన ఫలితం వస్తుందో కూడా వివరిస్తోంది. తద్వారా జస్ట్ మేం చెప్పింది చేయండి చాలు.. మార్పు దానంతట అదే వస్తుందని పిలుపునిస్తోంది. మొన్నటికి మొన్న జంతర్ మంతర్ దగ్గర పోగైన యువత మొత్తం మేం పదవులు అడగటం లేదు.. అధికారంలో భాగస్వామ్యం అడగటం లేదు.. మా సమస్యలు పరిష్కరించండి.. వ్యవస్థల ప్రక్షాళన చేయండి అని గట్టిగా నినదించారు. నిస్వార్థమైన ఈ యువత కోరికే బలమైన ఆశయంగా మారి ప్రభుత్వాన్ని కదిలించింది. ఇది పైకి కనిపించిన పరిణామం. కానీ ఇదే ఆశయం తెరవెనుక మొత్తంగా దేశ రాజకీయ వ్యవస్థనే గట్టిగా కుదిపేసింది. సాధారణంగా భూమిలోపల ఫలకాల కదలికల్లో మార్పుల కారణంగా భూకంపం వస్తుంది. ఇప్పుడు యువత ఆలోచనల్లో వచ్చిన మార్పుల వేగం కారణంగా దేశంలో రాజకీయ భూకంపం వచ్చి.. సరికొత్త రాజకీయానికి బాటలు పడుతుందనే చర్చ జరుగుతోంది. దేశ రాజకీయాల్లో వచ్చే మార్పుల్ని వేగంగా పసిగట్టడంలో.. తెలుగు రాష్ట్రాల్లో సంప్రదాయ పార్టీలు ఆరితేరాయి. ఆ మాటకొస్తే ఎప్పటికప్పుడు రాజకీయాల్లో కొత్త ట్రెండ్‌కు తెరలేపటం కూడా వీటికి అలవాటే. కాకపోతే మిగతా పార్టీలతో పాటే మన తెలుగు రాష్ట్రాల పార్టీలు కూడా కొన్నాళ్లుగా యువతలో గూడుకడుతున్న అసంతృప్తిని తెలుసుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పుడు ఢిల్లీ ఉద్యమం తర్వాత జెన్‌జీ ఆలోచనల గురించి చూచాయగా తెలియడంతో.. అర్జెంట్‌గా తమ రాజకీయ వ్యూహాలు పునఃసమీక్షించుకునే పనిలో పడ్డాయి. పనిలోపనిగా యువత కేంద్రంగా రాజకీయం చేస్తామని ప్రకటించాయి. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అగ్రనేతలు తమ రోజువారీ కార్యకలాపాల్లో యువత భాగస్వామ్యం ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి.. నీట్ మృతులకు నివాళిగా హైదరాబాద్ లో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో యువతతో కలిసి పాలు పంచుకున్నారు. అలాగే జెన్‌జీలతో కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూడటం, వాళ్లకు జర్మన్ భాష నేర్పటం, మెస్సిని హైదరాబాద్ తీసుకురావడం లాంటి పనులు చేశారు. చేస్తున్నారు. అంతేకాదు ప్రజాప్రతినిధుల కనీస అర్హత వయసును కూడా తగ్గించాలనే ప్రతిపాదన కూడా పెట్టారు. తద్వారా జెన్‌జీ రాజకీయంలో కాంగ్రెస్ ముందుందని చెప్పే ప్రయత్నం చేశారు. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విషయానికొస్తే.. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. హైదరాబాద్ లో నిరుద్యోగుల ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వాలు యువత ఆకాంక్షలు గుర్తించాలని డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా జెన్‌జీలతో మీటింగులు, వాళ్లతో భోజనాలు, జిమ్ ప్రాక్టీస్‌లు కూడా చేస్తున్నారు కేటీఆర్. తద్వారా యువత కేంద్రంగా రాజకీయం చేయడంలో తామెక్కడా వెనకబడలేదని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అటు ఏపీలోనూ సీఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ పోటాపోటీగా యువతతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి తానే అసలైన జెన్‌జీ అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగులు పెడుతూ.. విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతున్నారు. అదే సమయంలో పార్టీలోనూ యువతకు పెద్దపీట వేస్తామని చెబుతున్నారు. జగన్ కూడా కొద్దిరోజుల క్రితమే డీఎస్సీ అభ్యర్థులతో సమావేశమై డీఎస్సీతో పాటు యువత సమస్యలపై చర్చించారు. తేడా వస్తే ఏపీలో కూడా కాక్రోచ్‌లు లేస్తాయని గతంలోనే హెచ్చరించారు. ఇక ముందు కూడా జెన్‌జీ కేంద్రంగా రాజకీయం చేస్తామనే సంకేతాలిచ్చారు. ఇక్కడ ఏపీ అయినా.. తెలంగాణ అయినా ప్రధాన పార్టీల అజెండా ఒకటే. దేశవ్యాప్తంగా యువ రాజకీయం కదం తొక్కుతున్న తరుణంలో.. మారుపును తాము కూడా అందిపుచ్చుకోవాలన్నదే. అలాగే తమ విధానాలపై యువతలో అసంతృప్తి రాకుండా.. ముందే జెన్‌జీకి అనుకూలమైన విధానాలతో వారిని ఆకట్టుకోవాలని చూస్తున్నాయి. అందుకే అగ్రనేతలు యువతపై ఫోకస్ పెట్టి.. తమ కార్యకలాపాలు మార్చుకుంటున్నారు. తద్వారా జెన్‌జీతో పాటు వారి తల్లిదండ్రుల ఓట్లనూ టార్గెట్ చేస్తున్నారు. ఇలా స్వామికార్యంతో పాటు స్వకార్యమూ నెరవేరేలా రాజకీయ ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల చరిత్రలో యువతకు పెద్దపీట వేసిన సందర్భాలను జెన్‌జీకి గుర్తుచేస్తున్నారు. అవసరమైతే జెన్‌జీకి రాజకీయ ప్రోత్సాహం అందించడంలో మిగతా పార్టీలన్నింటికన్నా ఎక్కువ చొరవే తీసుకుంటామని హామీలిచ్చేస్తున్నారు. మరికొందరు నేతలైతే.. వచ్చే ఎన్నికలు యువత చుట్టే తిరుగుతాయని జోస్యాలు చెబుతున్నారు. ఇప్పట్నుంచీ ఎన్నికల వరకూ జెన్‌జీని అంటిపెట్టుకుని రాజకీయం చేయాలని క్యాడర్‌కు హితబోధ చేస్తున్నాయి. స్వయంగా ప్రధాని మోడీనే ఇన్‌స్టా వీడియోలతో యువతలో టచ్‌లో ఉండాలని కేంద్ర మంత్రులకు సూచించటాన్ని ఉదాహరణగా చూపిస్తున్నాయి. ఆ మాటకొస్తే ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పార్టీలకు యాక్టివ్ సోషల్ మీడియా వింగులున్నాయి. కాకపోతే ఇప్పటివరకు ఆయా వింగులు రాజకీయ రొచ్చుకే ప్రాధాన్యమిచ్చాయని, ఇకపై వ్యూహం మార్చి.. యువతను సూదంటురాయిలా ఆకర్షించే ప్లాన్ రూపొందించాలని నేతలు సూచిస్తున్నారు. ఇందుకోసం సరికొత్త వ్యూహాలు, నినాదాలు కూడా అవసరమని చెబుతున్నారు. ఏం చేసైనా సరే.. యువత ఓట్లన్నీ తమ పార్టీకే పడేలా చూడాలని అగ్రనేతలంతా కాలికి బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. మొన్నటి బీహార్ ఎన్నికల దాకా మహిళా ఓట్లే ఎన్నికల్లో విజయానికి తురుపుముక్కగా ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఢిల్లీ ఉద్యమం తర్వాత కొన్నాళ్ల పాటు యువత ఓట్లే గెలుపుకు ఇంధనం అవుతాయని, దీనికి విజయ్ గెలుపుతోనే బీజం పడిందని సంప్రదాయ పార్టీలన్నీ ఆలస్యంగా గుర్తించాయి. అందుకే ఇక వ్యూహరచనలో వేగం పెంచి.. జెన్‌జీ స్పీడుకు తగ్గట్టుగా పనిచేయక తప్పదనే నిర్ధారణకు వచ్చాయి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# గోదావరి ఉగ్రరూపం..

**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10:14 గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. విదర్భ, చత్తీస్ గఢ్, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా ఇంద్రావతి నుంచి రికార్డు స్థాయిలో దాదాపు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో గోదావరి ప్రవాహం తీవ్రరూపం దాల్చింది. రాబోయే 24 నుంచి 36 గంటల్లో మేడిగడ్డ, భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం 12 నుంచి 17 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని వరద ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. ఎస్ఆర్ఎస్పీ, ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులతో పాటు భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు: సబ్ కలెక్టర్ ఆదేశాలు**

వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భద్రాచలం సబ్ కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. 'గోదావరి ఫ్లడ్ మాన్యువల్' ప్రకారం వరద నివారణ విధులు నిర్వర్తించే అధికారులందరూ తక్షణమే అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ లు, సబ్ కంట్రోల్ రూమ్లను అందుబాటులోకి తెచ్చారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు, ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

**గోదావరి ఘాట్ వద్ద కొరవడిన భద్రత.. భక్తుల ఆందోళన..**

ఒకవైపు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. మరోవైపు స్నాన ఘట్టాల వద్ద భద్రతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిన్న రాత్రి నుంచి ఇప్పటివరకు నది నీటిమట్టం ఏకంగా 14 అడుగుల పెరిగింది. పవిత్ర స్నానాల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రమాదాన్ని గ్రహించకుండా ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో దిగుతున్నారు. అయితే.. ఘాట్ వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఎక్కడా కనిపించకపోవడం, భక్తులను హెచ్చరించాల్సిన గ్రామపంచాయతీ, రెవెన్యూ లేదా పోలీస్ సిబ్బంది ఆచూకీ లేకపోవడంపై స్థానికులు, భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధృతి క్షణక్షణం పెరుగుతున్న వేళ. ఘాట్ల వద్ద తక్షణమే మైకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, భద్రతా సిబ్బందిని కాపలా ఉంచాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులను అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్ద గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమోదైంది. బ్యారేజ్ వద్ద మొత్తం 8,35,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఇన్లో, అవుట్లోగా కొనసాగుతుండగా, వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాద స్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**వర్షాల ఎఫెక్ట్.. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రాకపోకలు బంద్**

వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణను కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఏకధాటిగా కురుస్తున్న జడివానకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నిన్నమొన్నటి వరకు వర్షాభావంతో కళావిహీనంగా మారిన చెరువులు, జలాశయాలు నేడు జలసిరులతో తొణికిసలాడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పైకి వరద నీరు చేరుకోవడంతో రాక పోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది.

**తెలంగాణ-మహారాష్ట్ర బంధం కట్..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఆదిలాబాద్ సమీపంలోని పెనంగా నది మహోగ్రరూపం దాల్చడంతో జైనథ్ మండలం ఆనంద్ పూర్ వద్ద వరద నీరు బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల మధ్య వాహనాల రాక పోకలను పూర్తిగా నిలిపివేశారు. ఏజెన్సీ మండలాలైన ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి పరిధిలో వంకతుమ్మ, నర్సాపూర్, శాంతాపూర్, మత్తడి గూడ సహా దాదాపు 16 గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కూలిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు భారీ వర్షాలు, ఈదురుగాలుల ధాటికి నిర్మల్ జిల్లాలో జనజీవనం తీవ్రంగా స్తంభించింది. ముథోల్ నియోజకవర్గంలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బైంసా మండలం మహాగంగుండెగాం గ్రామాల మధ్య భారీ వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోగా, కుబీర్ మండలం పార్డీ (బి) మార్గంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కుంటాల మండలంలోని కల్లూరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కొత్త వెంకూర్, పాత వెంకూర్, లింబ(బి), ఓలా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**ఆకట్టుకుంటున్న బ్రహ్మేశ్వర జలపాతం..**

ప్రమాదంలో గడ్డెన్నవాగు ఒకవైపు వర్షాల భయం ఉన్నప్పటికీ, కుబీర్ మండలంలోని బ్రహ్మేశ్వర జలపాతం సరికొత్త రూపుదాల్చి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పచ్చని కొండల నడుమ ప్రవహిస్తున్న జలసిరులను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. అయితే, ప్రవాహం ఎక్కువగా ఉన్నందున పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక ఎగువన మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో అధికారులు ప్రాజెక్ట్ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు.

# మెటా హెడ్‌పై కేసు నమోదు..

**ప్రధాని మోడీ AI మార్ఫింగ్ వీడియో..**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను AI (కృత్రిమ మేధ) సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు AI సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? ప్లాట్‌ఫామ్స్ వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ప్లాట్‌ఫామ్‌లలో AI స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే ప్రక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై, తమ వద్ద ఉన్న కంటెంట్ మోడరేషన్ విధానాలు, నిబంధనల వివరాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ ఆధారాల ప్రకారమే అన్ని ఆరోపణలను పరిశీలిస్తామని, ప్రస్తుతం ఎవరిపై నేరం రుజువు కాలేదని, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

# సీఎంఆర్ పేరిట దోపిడీ

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిజామాబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన సీఎంఆర్ రైస్‌ను ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారు. వారికి అధికారుల తనిఖీలన్నా, నోటీసులన్నా, ఆఖరుకు క్రిమినల్ కేసులన్నా భయం లేకుండా పోయిందని అధికారులు అంటున్నారు. జిల్లాలోని కొందరు బడా రైస్ మిల్లర్లు తమకున్న రాజకీయ అండదండలతో అధికారులపైనే ఒత్తిళ్లు తెచ్చి సీఎంఆర్ రైస్ విషయంలో తప్పించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే పలువురు రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయల విలువైన సీఎంఆర్ ఎగవేతను తమ జన్మహక్కుగా భావిస్తున్నారేమోననే అభిప్రాయాలు కలుగుతున్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే సీఎంఆర్ విషయంలో రైస్ మిల్లర్లు ఎంత తెగింపు ధోరణితో వ్యవహరిస్తున్నారనే విషయం అర్థమవుతోంది. గత ప్రభుత్వ హయాంలోనూ దాదాపు రూ. 400 కోట్ల మేర సీఎంఆర్ బకాయిలు పేరుకు పోగా, జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి పై కేసులు కూడా నమోదయ్యాయి. అప్పట్లో బీఆర్ఎస్‌కు చెందిన వ్యాపారులే సీఎంఆర్ ఎగవేతలో అగ్రస్థానంలో ఉండగా కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లో ఎన్నికల సమయంలో సీఎంఆర్ ఎగవేత దారులైన ప్రజాప్రతినిధుల పోటీకి అర్హత కలిగించేలా వారికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

**రైస్ మిల్లర్ల పై అధికారుల ఫోకస్ .. మిల్లుల్లో తనిఖీలు..**

గత కొన్ని సీజన్లుగా సర్కారుకు తిరిగి ఇవ్వాల్సిన సీఎంఆర్ తిరిగి ఇవ్వకుండా పక్కదోవ పట్టిస్తూ కోట్లు గడిస్తున్న వారి రైస్ మిల్స్ పై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సీఎంఆర్ బకాయిల రికవరీ కోసం తెలంగాణ వ్యాప్తంగా రైస్ మిల్లర్ల పై అధికారులు దాడులు జరిపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కూడా అధికారులు పలు రైస్ మిల్స్ పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కాలూరు లోని ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు కాపర్తి శ్రవణ్‌కు సంబంధించిన కాపర్తి సిద్దరామేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ లో అధికారులు తనిఖీలు నిర్వహించగా సీఎంఆర్ రైస్ భారీ స్థాయిలో మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అధికారులు తనిఖీలు నిర్వహించే సమయానికి రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారం రైస్ మిల్లులో ఉండాల్సిన స్టాక్ కన్నా 20,368 టన్నుల స్టాక్ తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాదాపు రూ. 57.25 కోట్ల విలువైన సీఎంఆర్ రైస్ పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించారు. రబీ 2024 25, ఖరీఫ్ 2025 26, రబీ 2025 26 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బకాయిలున్నట్లు అధికారులు తెలిపారు. సాలూరలోని సాయి లక్ష్మి రైస్ మిల్‌లో కూడా అధికారులు తనికీలు నిర్వహించగా అక్కడ కూడా దాదాపు రూ. 15 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు.

**సీఎంఆర్ విషయంలో ఏం జరుగుతోంది?**

రైస్ మిల్లర్లు ధాన్యాన్ని మిల్లులో మర ఆడించి బియ్యాన్ని తిరిగి ఇవ్వకుండా వాటిని నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్లో అమ్ముకుంటూ ప్రభుత్వానికి కుచ్చు టోపీ పెడుతున్నారు. సీఎంఆర్ రైస్ ను పక్కదోవ పట్టించి కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగ్గొడుతున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో సంబంధిత అధికారులపై ఒత్తిడి పెంచి సీఎంఆర్ రికవరీ కోసం జరిగే ప్రయత్నాలను కూడా అడ్డుకుంటున్నారనే టాక్ ఉంది. సీఎంఆర్ రైస్ తిరిగి ఇవ్వని రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు బుక్ చేయించే అవకాశాలున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో మిల్లర్లు తమపై కేసులు నమోదు కాకుండా తప్పించుకోగలుగుతున్నారు. తాజాగా సిద్ది రామేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని మరి కొన్ని రైస్ మిల్లులపై కూడా అధికారులు ఫోకస్ పెట్టి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

# జితేంద్రసింగ్ పై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీసు

**న్యూ ఢిల్లీ :** విద్యార్థుల నిరసన ప్రదర్శనపై పోలీసుల కాల్పుల ఘటనకు సంబంధించి పార్లమెంటును తీవ్రంగా తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌పై కాంగ్రెస్ పార్టీ.. హక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్) నోటీసు ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, లోక్‌సభ ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కె.సి. వేణుగోపాల్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఈ మేరకు నోటీసు అందజేశారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా జూలై 20న విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన ఆందోళనపై పోలీసులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నిరసనల సమయంలో భద్రతా దళాలు పెల్లెట్ గన్లు , లాఠీఛార్జ్ ప్రయోగించి విద్యార్థులపై దాడి చేశాయని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఈ ఆందోళనలో పెల్లెట్ గన్ దాడికి గురై తీవ్రంగా గాయపడిన సాహిల్ అనే ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని మీడియా ముందుకు తీసుకువచ్చారు. బాధితుడి కంటికి తీవ్ర గాయమై చూపు పోయే ప్రమాదం ఉందని, అతనికి సంబంధించిన ఆసుపత్రి రికార్డులు కూడా ఇప్పటికే వెలుగులోకి వచ్చాయని కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అయితే.. జూలై 29న 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026' పై లోక్‌సభలో జరిగిన చర్చకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిస్తూ అసత్య వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. సభలో మాట్లాడిన మంత్రి, "అక్కడ ఎలాంటి కాల్పులు (ఫైరింగ్) జరగలేదని, కేవలం టియర్ గ్యాస్ మాత్రమే ఉపయోగించామని మళ్లీ మళ్లీ స్పష్టమైంది. అసలు కాల్పులే జరగనప్పుడు ఆదేశాలు ఇచ్చే ప్రశ్నే ఉత్పన్నం కాదు" అని వ్యాఖ్యానించారు.

**హక్కుల కమిటీకి పంపాలని వేణుగోపాల్ డిమాండ్**

మంత్రి చేసిన వ్యాఖ్యలు గ్రౌండ్ రియాలిటీకి పూర్తిగా విరుద్ధమని కె.సి. వేణుగోపాల్ ఆరోపించారు. గాయపడిన బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, దీనికి సంబంధించిన ఆధారాలు పబ్లిక్ డొమైన్లలో అందుబాటులో ఉన్నప్పటికీ మంత్రి కావాలనే సభలో పచ్చి అబద్ధాలు చెప్పారని నోటీసులో పేర్కొన్నారు. దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటును తప్పుదోవ పట్టించడం అనేది తీవ్రమైన హక్కుల ఉల్లంఘన, సభను ధిక్కరించడమే అవుతుందని తెలిపారు. లోక్‌సభ నిబంధనలలోని Rule 222 కింద మంత్రిపై వెంటనే ప్రివిలేజ్ చర్యలు ప్రారంభించి, ఈ వ్యవహారాన్ని సమగ్ర విచారణ నిమిత్తం 'ప్రివిలేజెస్ కమిటీ' కి బదిలీ చేయాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు

# అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

**భద్రాద్రి కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం) జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# నేను బాధ్యత వహిస్తా

**న్యూ ఢిల్లీ :** ఢిల్లీలో సీజేపీ ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జీ, పెల్లెట్ గన్స్ వినియోగించాని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది భయం లేకుండా తమ విధులను నిర్వర్తించాలని, సిబ్బంది తీసుకునే నిర్ణయాలు, చర్యలకు డైరెక్టర్ జనరల్‌గా నేనే పూర్తి బాధ్యత వహిస్తానని అన్నారు. సెంట్రల్ ఫోర్స్ ఇన్వెస్టిచర్ వేడుకలో పాల్గొన్న జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్.. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆపరేషనల్ బెటాలియనైనా లా అండ్ ఆర్డర్ యూనిట్ అయినా మీరు నిజాయితీతో విధి నిర్వహణలో భాగంగా తీసుకునే ఎలాంటి చర్యలకైనా డైరెక్టర్ జనరల్‌గా నేను బాధ్యత వహిస్తానని పేర్కొన్నారు.

**పొలిటికల్ వివాదం వేళ వ్యాఖ్యలు:**

ఇటీవల దేశ రాజధానిలో జరిగిన పరీక్షా పత్రాల లీకేజీ నిరసనల సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కి చెందిన RAF (రాపిడ్ యాక్షన్ ఫోర్స్) పెల్లెట్ గన్లను ఉపయోగించడంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ అంశంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంట్ వేదికగా టార్గెట్ చేస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నే స్వయంగా విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**మూల్యాంకనం చేసుకుంటాం:**

అయితే ఢిల్లీ ఆందోళనపై గతంలో ఓ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడిన సీఆర్ పీఎఫ్ చీఫ్.. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. ప్రామాణిక నిర్వహణ విధానం ప్రకారమే ఈ సమీక్ష జరుగుతుందని అసలు ఏ పరిస్థితుల్లో పెల్లెట్ గన్లను ఉపయోగించాల్సి వచ్చింది, ప్రోటోకాల్‌లను సరిగ్గా పాటించారా లేదా అనే విషయాలపై పూర్తి అధ్యయనం చేసామని ఆయన వివరించారు. జంతర్ మంతర్ ఆందోళన మంటలు ఇప్పుడు పార్లమెంట్‌లో పొలిటికల్ టర్న్ తీసుకున్న వేళ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ వ్యాఖ్యలు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయో చూడాలి.

# బీజేపీకి షెహజాద్ రాజీనామా

**న్యూ ఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా పార్టీ వీడారు. తాజాగా, తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో షెహజాద్ బీజేపీని వీడినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాజీనామా నేపథ్యంలో ఆయన గురువారం తన ఎక్స్ ఖాతాలో బయో వివరాలు మార్చేశారు. 'జాతీయ అధికార ప్రతినిధి' హోదాను తొలగించారు. షెహజాద్ పూనావాలా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా చాలా యాక్టీవ్‌గా ఉండేవారు. బీజేపీ తరఫున తరచుగా టీవీ డిబేట్లలో పాల్గొనేవారు.

**2017లో బీజేపీలోకి..**

షెహజాద్ పూనావాలా కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టారు. ఆయన 2017లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను బహిరంగంగా వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీని ఎన్నుకునే ప్రక్రియ అంతా ఒక నాటకమని, అది ముందే ఖరారైన వ్యవహారమని షెహజాద్ పూనావాలా తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో ప్రజాస్వామ్యం లేదని, అర్హత ఆధారంగా కాకుండా కేవలం కుటుంబ నేపథ్యం ఆధారంగానే పదవులు ఇస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే నిష్పక్షపాతంగా ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. బీజేపీ ఆయనకు జాతీయ అధికార ప్రతినిధి పదవిని కల్పించింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆయన బీజేపీ నుంచి బయటకు వచ్చేశారు. అయితే, ఆయన ఏ కారణాలతో పార్టీని వీడారన్నది అధికారికంగా తెలియరావాల్సి ఉంది.

# తృటిలో తప్పిన ప్రమాదం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఇండిగా 6వ717 విమానంలో గతరాత్రి బయల్దేరారు. అయితే విమానం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకునే సమయానికి ఏటీఎఫ్ నుంచి క్లియరెన్స్ రాలేదు. దీంతో విమానాన్ని రన్ వే పై ల్యాండింగ్ చేసినట్లే చేసి.. పైలట్ మళ్లీ టేకాఫ్ తీసుకున్నారు. 20 నిమిషాల పాటు విమానం గాల్లో చక్కర్లు కొట్టి.. బుధవారం రాత్రి 8.35 గంటలకు సేఫ్ గా ల్యాండ్ అయింది. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి సహా విమానంలో 229 మంది ప్రయాణికులు ఉన్నారు. చాలా సేపు గాల్లో చక్కర్లు కొట్టడంతో అందరూ కంగారు పడ్డారు. పైగా విమానంలో సీఎం కూడా ఉండటంతో ఏం జరుగుతుందోనని సెక్యూరిటీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. చివరకు సేఫ్ గా ల్యాండ్ చేయడంతో.. హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

# అగ్రిబిజినెస్‌లో పీజీడీఎం కోర్సు ప్రారంభం



**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత వ్యవసాయ రంగం సాంకేతికత, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలు మరియు డిజిటల్ ఆవిష్కరణలతో వేగంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (VJIM) అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్‌లో PGDM కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరిశ్రమ అనుభవం, ఆవిష్కరణ, సుస్థిరత మరియు నాయకత్వాన్ని కేంద్రంగా చేసుకుని రూపొందించిన ఈ కార్యక్రమం అభివృద్ధి చెందుతున్న అగ్రిబిజినెస్ వ్యవస్థలో ప్రభావవంతమైన మార్పును తీసుకురాగల నిపుణులను తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమ ప్రారంభోత్సవానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ తేనెటీగల పెంపకదారు, నేషనల్ బీ బోర్డు సభ్యురాలు మరియు Sacred Honey వ్యవస్థాపకురాలు శ్రీమతి ఇందిరా రెడ్డి తదితర పరిశ్రమ నిపుణులు హాజరయ్యారు. భారత వ్యవసాయ రంగం డిజిటల్ రూపాంతరం, వాతావరణ అనుకూల వ్యవసాయం, ప్రెసిషన్ ఫార్మింగ్, AI, డేటా అనలిటిక్స్ మరియు అగ్రిటెక్ ఆవిష్కరణలతో కీలక మార్పును చూస్తోంది. వ్యవసాయం సాంకేతికత ఆధారిత, మార్కెట్ ఆధారిత రంగంగా మారుతున్న ఈ సమయంలో వ్యాపార నిర్వహణతో పాటు వ్యవసాయ వ్యవస్థలపై అవగాహన కలిగిన నిపుణుల అవసరం మరింత పెరిగింది. ఈ కోర్సులో విద్యార్థులు అగ్రిటెక్, AI ఆధారిత వ్యవసాయం, ప్రెసిషన్ ఫార్మింగ్, అగ్రిబిజినెస్ అనలిటిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, సరఫరా గొలుసు నిర్వహణ, అగ్రి-ఫైనాన్స్, కమోడిటీ మార్కెట్లు, గ్రామీణ మార్కెటింగ్, సుస్థిరత మరియు వ్యవస్థాపకత వంటి రంగాల్లో అనుభవాన్ని పొందుతారు. AICTE ఆమోదం పొందిన ఈ PGDM కార్యక్రమం భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన పాఠ్యాంశాలు మరియు బలమైన పరిశ్రమ భాగస్వామ్యంతో రూపొందించబడింది. పరిశ్రమ సందర్శనలు, ఫీల్డ్ విజిట్లు, లైవ్ కన్సల్టింగ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, వ్యాపార నాయకులు, నిపుణులు మరియు ప్రగతిశీల రైతులతో పరస్పర చర్యల ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక నైపుణ్యాలు మరియు వాస్తవ అనుభవాన్ని అందిస్తుంది.

**ప్రారంభోత్సవ సందర్భంగా శ్రీ దుర్గా ప్రసాద్ కోడే, ప్రధాన కార్యదర్శి, విజ్ఞాన జ్యోతి మాట్లాడుతూ:**

"నేడు వ్యవసాయం అనేది సాంకేతికత, ఆవిష్కరణలు మరియు వ్యవస్థాపకత కలిసే కీలక దశలో ఉంది. భారత్ మరింత స్థిరమైన, ప్రపంచ స్థాయిలో పోటీపడగల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో, అత్యుత్తమ నిర్వహణ నైపుణ్యాలను వ్యవసాయ రంగంపై లోతైన అవగాహనతో మేళవించగల నాయకుల అవసరం మరింత పెరిగింది. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ వ్యాపార వ్యవస్థలో స్థిరమైన ప్రభావాన్ని సృష్టించడంతో పాటు రైతు సమాజాన్ని శక్తివంతం చేసి, దేశ వ్యవసాయ భవిష్యత్తును మరింత బలోపేతం చేసే నిపుణులను తీర్చిదిద్దడమే VJIM లక్ష్యం. మా విద్యార్థులకు మాత్రమే కాకుండా దేశానికీ ప్రయోజనం చేకూరే నాణ్యమైన విద్యను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ప్రస్తుతం భారత్ సేవారంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ, వ్యవసాయాన్ని కూడా లాభదాయకమైన రంగంగా మార్చడం అంతే ముఖ్యమైనది. ఆ మార్పుకు నాయకత్వం వహించే నాయకులను తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు."

**డా. భారత్ భూషణ్ సింగ్, డైరెక్టర్, VJIM మాట్లాడుతూ:**

"భారతదేశ భౌగోళిక విస్తీర్ణంలో సుమారు 43 శాతం భూమి సాగుకు అనుకూలంగా ఉంది. ధాన్యాల ఉత్పత్తిలో మనం రికార్డు స్థాయికి చేరుకున్నాము. ఉద్యానవన రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే నిల్వ సదుపాయాల కొరత మరియు నైపుణ్యం కలిగిన మానవ వనరుల లోపం ఇంకా కొనసాగుతున్నాయి. సరఫరా గొలుసు నిర్వహణ, పంపిణీ, బ్రాండింగ్ మరియు మార్కెటింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించగల అగ్రిబిజినెస్ మేనేజర్లు మనకు తగిన సంఖ్యలో ఉంటే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. పరిశ్రమ భాగస్వాములతో సన్నిహిత సంప్రదింపుల ద్వారా రూపొందించిన మా PGDM in Agribusiness Management కార్యక్రమం ద్వారా విద్యార్థులు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు, అలాగే అగ్రిబిజినెస్ విలువ గొలుసులో ఏర్పడుతున్న కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన జ్ఞానం, ప్రాయోగిక అనుభవం మరియు నాయకత్వ సామర్థ్యాలతో పట్టభద్రులవుతారు. ప్రెసిషన్ ఫార్మింగ్, స్మార్ట్ ఫార్మింగ్ నుంచి స్మార్ట్ వేర్‌హౌసింగ్ వరకు ఈ రంగంలో అవకాశాలు అపారంగా ఉన్నాయి."ఈ కార్యక్రమానికి Bayer, Coromandel International, SeedWorks, Nuziveedu Seeds, Rallis India (A Tata Enterprise), Crystal Crop Protection, Mahyco Grow, ADAMA India, UPL, INERA CropScience, Savannah Seeds, IFFCO, Advanta Seeds, ADM, PI Industries మరియు ACSEN AgriTech సంస్థల మద్దతు లభిస్తోంది. విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, మెంటర్‌షిప్ మరియు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంటాయి.

**విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (VJIM) గురించి**

1993లో ది విజ్ఞాన జ్యోతి సొసైటీ స్థాపించిన VJIM ప్రముఖ స్వయంప్రతిపత్తి కలిగిన బిజినెస్ స్కూల్. AICTE ఆమోదం మరియు చీదీూ గుర్తింపు పొందిన ఈ సంస్థ రెండేళ్ల పూర్తి సమయ PGDM కార్యక్రమాలను అందిస్తోంది. AIU ద్వారా వీదీూ సమాన అర్హతగా గుర్తింపు పొందిన ఈ కోర్సులు విద్యార్థులను నైతిక విలువలు, ప్రపంచ దృష్టికోణం మరియు నాయకత్వ నైపుణ్యాలతో తీర్చిదిద్దేలా రూపొందించబడ్డాయి.

# ఆర్టీసీ గ్యారేజ్ లో కృష్ణయ్య చేసిన సేవలు మరువలేనివి

## పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన గ్యారేజ్ కార్మికులు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** టీ.జి.ఎస్.ఆర్.టి.సి లో గత 36 సంవత్సరాలు గా సూర్యాపేట,కోదాడ,దేవరకొండ, మిర్యాలగూడ ఆర్. టి.సి డిపో లలోలీడింగ్ మెకానిక్ గా, సూపర్వైజర్ గా రాగోజు కృష్ణయ్య విధులు నిర్వహించి శుక్రవారం మిర్యాలగూడ ఆర్టిసి గ్యారేజ్ లో తోటి ఉద్యోగుల అభినందనల తో అందరి చేత విశిష్ట మన్నాలను పొంది,ఆర్టీసీ పురోభివృద్ధికి నిరంతరం శ్రమించి ఎందరికో ఆదర్శంగా నిలిచి తోటి ఆర్టీసీ కార్మికులు కలిసి ఉద్యోగ వి రమణ సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా డిపో మేనేజర్ రామ్మోహన్ రావు,గ్యారేజ్ ఇంచార్జి యాదగిరి పాల్గొని మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ ఏనాడు ఎలాంటి తప్పిదం లేకుండా అందర్నీ కలుపుకొంటూ తన పని తాను చేసుకుంటూ సహచర ఉద్యోగులతో కలిసిమెలిసి పనిచేసేవాడన్నారు. కృష్ణయ్య మృదుస్వభావి అని,తాను ఎక్కడ ఉన్నా ఆర్టీసీ కార్మికులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కృష్ణయ్య మాట్లాడతూ ఆర్టీసీ చెట్టు లాంటిదని చెట్టు ఏ విధంగా నీడనిస్తుందో కార్మికులకు డిపో చెట్టు లాంటిదని వారన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికులతో కలిసి కృష్ణయ్య అనిత దంపతులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి హృదయపూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో 99.79% ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో 99.79 శాతం డిజిటలైజేషన్ పూర్తవడంతో రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడుతున్నామని చెప్పారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న 13 పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అవసరమైన చోట కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా, నివాసం మార్చుకున్న ఓటర్ల వివరాలను నవీకరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# మాలల స్థానం ఎక్కడ...?

## మాలలపై చిన్నచూపు చూపిస్తున్న ఎమ్మెల్యే కూచిమల్ల నాగేష్, మాలమహానాడు మండల అధ్యక్షులు

**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ మండలంలోని మాలలకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతుందని మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ విలేకరుల సమావేశంలో ఒక ప్రకటన విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల పిఎసిఎస్ నూతన పాలకవర్గాన్ని, మండల పరిధిలోని వెంకటపురం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఇటీవల ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. పిఎసిఎస్ పాలకవర్గంలో, శ్రీమత్స్యగిరిలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పాలకవర్గంలో మాల కులస్తులకు అవకాశం కల్పించలేదని, ఇదంతా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కనుసైగల్లోనే జరిగిందని ఆయన అన్నారు. ఎలక్షన్లలో మాలల ఓటు బ్యాంక్ కావాలి కానీ మాలలకు పదవులలో సముచిత స్థానం కల్పించడంలో మీరెందుకు వివక్ష చూపిస్తున్నారో ఎమ్మెల్యే



అనిల్ కుమార్ రెడ్డి వలిగొండ మండల మాలలకు సమాధానం చెప్పాలన్నారు. ఆనాడు మీ గెలుపు కోసం ముందుండి పనిచేసిన మాలలకు నేడు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఎలా ఊరుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులైనా మాపై ఆలోచన చేయలేదంటే మాలలపై ఇంత కక్ష ఎందుకో చెప్పాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముందు ముందు వివక్ష లేకుండా మాలలకు సముచిత స్థానం కల్పించి గౌరవించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు.

# ఎల్‌నినో ప్రభావం

## ఆరుతడి పంటల సాగుపై కలెక్టర్ సూచన

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం బచ్చన్నపేట మండలం ఎద్దుగూడెం గ్రామంలో పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో సాగు పరిస్థితులు, దిగుబడులు, మార్కెట్ అవకాశాలపై చర్చించారు. పెసర, నువ్వులు, కందులు, మిర్చి తదితర ప్రత్యామ్నాయ పంటలు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమని పేర్కొన్నారు. సమీకృత వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తున్న రైతులను అభినందిస్తూ, ఇలాంటి నమూనాలను ఇతర రైతులకు పరిచయం చేయాలని అధికారులకు



ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించి ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎన్ఆర్ఎల్ఎమ్ పథకాల ద్వారా గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టి ఉపాధి అవకాశాలు పెంచాలని అధికారులకు ఆదేశించారు. రైతులు శాస్త్రీయ సూచనలు పాటిస్తూ పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు వేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జనగామ మండలం గోపరాజుపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన తరగతి గదుల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయి, మౌలిక వసతులు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి పఠన, రచన, అవగాహన సామర్థ్యాలను పరీక్షించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం బలోపేతానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆంగ్ల బోధనను పరిశీలించి విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి ప్రతిభను ప్రోత్సహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటగది పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. పాఠశాల భవనానికి మరమ్మతులు, వైట్‌వాష్ చేపట్టడంతో పాటు మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సేవలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, అర్థం చేసుకునే ప్రాథమిక నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



# వాటర్ ట్యాంక్ నిర్మాణం వేగవంతంగా పూర్తి కావాలి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ,ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో అమలు చేస్తున్న అమృత్ స్కీమ్ 2.0 పనులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను క్షుణ్ణంగా పరిశీలించి,నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగించే దిశగా చేపడుతున్న అమృత్ స్కీమ్ 2.0 అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా,నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత వాన..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, బేగంపేట్, సికింద్రాబాద్, అంబర్ పేట్, కాచిగూడ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. అదే విధంగా జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, ఖైరతాబాద్, లక్డీకపూల్, నాంపల్లి, కోఠిలోనూ వర్షం పడుతోంది. గత రెండు మూడు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న సంగత తెలిసిందే. రాష్ట్ర



వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గోదావరిలోకి భారీగా వరద నీరు చేరడంతో భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు సైతం నిండిపోవడంతో గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. హైదరాబాద్ లోనూ గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని కంపెనీలను పోలీసులు కోరుతున్నారు. సాయంత్రం ఇంటికి వెళ్లే సమయాల్లోనూ మార్పులు చేయాలని సూచిస్తున్నారు.




# అజింక్య అంటే ఓడిపోనివాడు..

టీమిండియా టెస్టు క్రికెట్‌లో స్టార్ బ్యాటర్లలో ఒకరైన అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు వెల్లడించాడు. 38 ఏళ్ల రహానే.. 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు సిరీస్ తర్వాత అతడు జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. 'క్యాప్ 278 సైనింగ్ ఆఫ్' అనే క్యాప్షన్‌తో భావోద్వేగ వీడియోను షేర్ చేస్తూ.. రహానే తన కెరీర్‌కు ముగింపు పలికాడు.

**ఆట కోసం అన్నీ అర్పించా:**

జీవితంలో ప్రతి ప్రారంభానికి ఒక ముగింపు ఉంటుందని, ఆ సమయం వచ్చినప్పుడు దానిని గౌరవించి ముందుకు సాగాల్సిందేనని రహానే తన సందేశంలో పేర్కొన్నాడు. 'బ్యాటింగ్‌లో సరైన టైమింగ్‌ను నేను ఎప్పుడూ నమ్మాను. అదే విధంగా ఇప్పుడు కూడా ముందుకు సాగే సరైన సమయం వచ్చిందని భావిస్తున్నాను. అందుకే అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నాను. ఆట కోసం నా శక్తి మేరకు అన్నీ అర్పించాను. నాకు వచ్చిన ప్రతి అవకాశం, ప్రతి ఇన్నింగ్స్‌లో దేశం కోసం ఆడాలనే తపనతోనే మైదానంలోకి దిగాను. నా వ్యక్తిగత ప్రయోజనాల కంటే.. దేశం, జట్టునే ముందుగా ఉంచాను. నిజాయితీతో ఆడితే క్రికెట్ ఎప్పుడూ మనకు తగిన ఫలితం ఇస్తుందనే నమ్మకంతో సాగాను' అని రహానే చెప్పాడు.

**క్రికెట్‌తో నా అనుబంధం కొనసాగుతుంది:**

'నా కెరీర్‌లో భారత క్రికెట్ ఎంతో అభివృద్ధి చెందడాన్ని ప్రత్యక్షంగా చూశా. గత 20 ఏళ్లుగా ఆ ప్రయాణంలో భాగమవడం గర్వకారణం. భారత క్రికెటర్‌గా నా అధ్యాయం ముగిసినా.. క్రికెట్‌తో నా అనుబంధం కొనసాగుతుంది. యువతకు మార్గనిర్దేశం చేస్తూ, ఆట నాకు నేర్పిన విలువలను తదుపరి తరానికి అందించేందుకు కృషి చేస్తా. ముంబై తరఫున తొలి అడుగుల నుంచి భారత జట్టు వరకు నా ప్రయాణంలో సహకరించిన బీసీసీఐ, ముంబై క్రికెట్ అసోసియేషన్, సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, ఐపీఎల్ ఫ్రాంచైజీలు, నా భార్య రాధిక, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. అభిమానుల ప్రేమను ఎప్పటికీ మరచిపోలేను' అని జింక్స్ చెప్పాడు.

**ఎన్నో ఓటములను చూపించింది:**

'అజింక్య అంటే ఓడిపోనివాడు. కానీ క్రికెట్ నాకు ఎన్నో ఓటములను చూపించింది. ఆటగాడిగా ఎన్నో తప్పులు చేశాను, జట్టు కూడా ఓడిపోయింది. అయినప్పటికీ ఒక చోట మాత్రం నేను ఎప్పుడూ ఓడిపోలేదు. అది అభిమానుల హృదయాల్లో. మీరు ఎప్పుడూ నన్ను మీ కుటుంబ సభ్యుడిలా ఆదరించారు. మీ ప్రేమ, నమ్మకం, మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు. క్యాప్ నంబర్ 278.. సైన్ ఆఫ్' అంటూ రహానే భావోద్వేగం చెందాడు. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో రహానే పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. 2020–21 బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో విరాట్ కోహ్లీ గైర్హాజరీలో గాయాలతో సతమతమవుతున్న జట్టును నడిపిస్తూ ఆస్ట్రేలియా గడ్డపై 2–1 తేడాతో చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించడం అతని కెరీర్‌లోనే కీలక మైలురాయిగా నిలిచింది. మెల్‌బోర్న్ టెస్టులో శతకంతో జట్టును విజయపథంలో నడిపించిన రహానే నాయకత్వం భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది.





# కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో గోల్డ్

కామన్ వెల్త్ గేమ్స్ లో ఇండియాకు పతకాల పంట పండుతోంది. తాజాగా ఈ గేమ్స్ లో భాగంగా మరో గోల్డ్ ఇండియాకు దక్కింది. మెన్స్ 109M T47 ఫైనల్స్ లో పారా అథ్లెట్స్ దిలీప్ గావిట్ గోల్డ్ దక్కించుకున్నాడు. అటు మహమ్మద్ బాసిల్ కు సిల్వర్ వచ్చింది. అదే సమయంలో లాంగ్ జంప్ లో భాగంగా.. 8.09 మీటర్ల లీప్ తో మురళి శ్రీ శంకర్ వెండి మెడల్ దక్కించుకున్నాడు. 2022లో సిల్వర్ సాధించిన మురళి... ఇప్పుడు రెండు లాంగ్ జంప్స్ మోడల్ సాధించిన తొలి భారతీయుడిగా రికార్డ్ సృష్టించాడు.

# ఏ బౌలర్‌కి భయపడతావు?..




టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 15 ఏళ్ల వయసులోనే విధ్వంసకర బ్యాటింగ్ తో సెపరేట్ ఫ్యాన్ బేస్ ను సంపాదించాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఐపీఎల్ 2025లో తన అద్భుతమైన ప్రదర్శనతో వెలుగులోకి వచ్చాడు. అలానే ఐపీఎల్ 2026 సీజన్‌లో మరింత మెరుగ్గా రాణించి, ఈ ఎడిషన్‌లోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. సూర్యవంశీ 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు చేసి, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ వంటి స్టార్ ప్లేయర్లను అధిగమించి ఆరెంజ్ క్యాప్‌ను గెలుచుకున్నాడు. వైభవ్ ఐపీఎల్‌లో అంతర్జాతీయ స్టార్ బౌలర్లను కూడా అలవోకగా చితకబాదాడు. జస్ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్ వంటి వారిని అతను చిత్తు చేసిన తీరు సూర్యవంశీ ప్రతిభకు ఉదాహరణ. ఈ క్రమంలో అసలు వైభవ్ ఏ బౌలర్ కి భయపడతాడు?, ఏ బౌలర్ కైనా భయపడతాడా? అనే సందేహాలు చాలా మంది క్రికెట్ అభిమానుల్లో ఉన్నాయి. అలాంటి ప్రశ్నలకు సరిగ్గా సమాధానం దొరికే ఓ వీడియోను రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియాలో ఒక వీడియోను పంచుకుంది.ఆ వీడియోలో.. ఏ బౌలర్‌నైనా ఎదుర్కోవాలంటే భయమా అని యాంకర్ అడిగినప్పుడు సూర్యవంశీ అదిరిపోయే మాస్ రిప్లయ్ ఇచ్చాడు. తాను భయపడే బౌలర్ ఇప్పటివరకు ఎవరూ లేరని బదులిచ్చాడు. ఈ చిన్న సమాధానం సూర్యవంశీకి తనపై ఉన్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పలువురు క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు వచ్చే నెలలో ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీ కోసం ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ జట్టుకు సూర్యవంశి వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అంతేకాక ఆ జట్టుకు బీహార్ నుంచి ఎంపికైన ఏకైక ఆటగాడు సూర్యవంశీ కావడం గమన్హారం.





# బంగ్లాదేశ్ క్రికెట్‌లో మార్పులు..

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టులో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వన్డే వరల్డ్ కప్ 2027 కోసం ఇప్పటి నుంచే తమ జట్టును సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా వన్డేల కోసం కొత్త కెప్టెన్ ను నియామకం చేసింది. లిటన్ దాస్ ను సరికొత్త వన్డే కెప్టెన్ గా అధికారికంగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నియామకం చేసింది. ఇటీవల కాలంలో మిరాజ్ సారథ్యంలో బంగ్లాదేశ్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఈ క్రమంలోనే నాయకత్వ మార్పునకు శ్రీకారం చుట్టింది. గతంలో వన్డే జట్టుకు తాత్కాలిక కెప్టెన్ గా అనుభవం ఉన్న లిటన్ దాస్, టీ20 జట్టుకు కూడా పూర్తిస్థాయిలో సారథిగా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలోనే లిటన్ దాస్ ను వన్డే కెప్టెన్ గా నియామకం చేసింది బంగ్లాదేశ్. ఇతని కెప్టెన్సీలోనే వన్డే వరల్డ్ కప్ 2027 ఆడనుంది బంగ్లా.

# బిజినెస్

# ఫార్మసీ బిజినెస్‌లోకి డిమార్ట్ ఎంట్రీ




కిరాణా వ్యాపారంలో తక్కువ ధరల మోడల్‌తో సంచలనం సృష్టించిన అవెన్యూ సూపర్ మార్ట్స్ (డీమార్ట్), కొత్తగా ఫార్మసీ రిటైల్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. సంస్థకు చెందిన పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ 'రిఫ్లెక్ట్ హెల్త్‌కేర్ అండ్ రిటైల్' ద్వారా ముంబైలోని ఎంపిక చేసిన డీమార్ట్ స్టోర్లలో 'షాప్–ఇన్–షాప్' పద్ధతిలో మెడికల్ కౌంటర్లను ప్రారంభించింది. అయితే, దీన్ని ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా మొదలుపెట్టడం గమనార్హం. మందులపై ఏకంగా 20 శాతం డిస్కౌంట్ ఆఫర్ చేస్తూ డీమార్ట్ నెట్‌వర్క్ తీసుకున్న ఈ నిర్ణయం.. స్థానిక చిన్న మెడికల్ షాపులతో పాటు, ఇప్పటికే ఆర్థిక నష్టాలతో లాభాల కోసం తంటాలు పడుతున్న ఈ–ఫార్మసీ సంస్థలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కిరాణా వ్యాపారంలో 7–8 శాతం మార్జిన్లు మాత్రమే ఉండగా, బ్రాండెడ్ జెనెరిక్స్ ఉన్న ఫార్మా రంగంలో 25 నుండి 30 శాతం వరకు మార్జిన్లు లభిస్తుండటమే డిమార్ట్ ఈ రంగంవైపు అడుగులు వేయడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. డీమార్ట్‌కు ఉన్న 503 హైపర్‌మార్కెట్ల నెట్‌వర్క్, భారీగా వచ్చే కస్టమర్ల రద్దీయే ఈ కొత్త వెంచర్‌కు అతిపెద్ద బలం. ప్రత్యేకంగా షాపులు అద్దెకు తీసుకోకుండా, కొత్త కస్టమర్లను ఆకర్షించే ప్రకటనల ఖర్చు లేకుండానే డిమార్ట్ ఈ 20 శాతం డిస్కౌంట్‌ను సులువుగా తట్టుకోగలదని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పెరిగిన పసిడి ధరలు




వరుసగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు ఇవాళ ఊహించని షాక్ ఇచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం పసిడి ధరలు పెరిగాయి. గ్లోబల్ మార్కెట్ సంకేతాలు, స్థానిక డిమాండ్ పెరగడంతో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.820 పెరిగి రూ.1,44,330 వద్దకు చేరింది. అదేవిధంగా ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.750 మేర ఎగబాకి రూ.1,32,300 వద్ద విక్రయమవుతోంది. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా వెండి ధర రూ.2,35,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని విభిన్న ప్రాంతాలను బట్టి, స్థానిక పన్నులు, రవాణా ఛార్జీల ఆధారంగా నగరాల మధ్య ఈ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉందని వర్తకులు తెలిపారు. అయితే బులియన్ మార్కెట్‌లో ప్రకటించే ఈ ప్రాథమిక ధరలపై వినియోగదారులు కొనుగోలు చేసే సమయంలో అదనంగా 3 శాతం జీఎస్టీ తో పాటు తయారీ కూలీ (మేకింగ్ చార్జీలు) వర్తిస్తాయని బులియన్ వర్తక సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

# ఒడిదుడుకుల్లో సూచీలు..




బుధవారం భారీ లాభాలు ఆర్జించిన దేశీయ సూచీలు గురువారం లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు బ్యాంకింగ్ సెక్టార్ అమ్మకాల ఒత్తిడిలో ఉండడం కూడా సూచీలను వెనక్కి లాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (95.75) బలపడింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (77,654)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఉదయం 9:40 గంటల సమయంలో సెన్సెక్స్ 31 పాయింట్ల లాభంతో 77,686 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 20 పాయింట్ల లాభంతో 24,270 వద్ద ఉంది .సెన్సెక్స్, నిఫ్టీలో హీరో మోటోకార్ప్, విప్రో, పెర్సిస్టెంట్, ఆల్కెమ్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. కేపీఐటీ టెక్, వారీ ఎనర్జీస్, డాబర్ ఇండియా, ప్రెస్టేజ్ ఎస్టేట్, ప్రీమియర్ ఎనర్జీస్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్ల నష్టంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 152 పాయింట్ల నష్టంతో ఉంది.

# గూగుల్‌ను అధిగమించిన మైక్రోసాఫ్ట్..



మైక్రోసాఫ్ట్ మరోసారి అంచనాలను మించి ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ 90 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6 లక్షల కోట్లు) ఆదాయం నమోదు చేసింది. క్లౌడ్, కృత్రిమ మేధ సేవలే ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా నిలిచాయి. ముఖ్యంగా అజూర్ క్లౌడ్ సేవల ఆదాయం 43 శాతం పెరిగింది. క్లౌడ్ వ్యాపారంలో గూగుల్‌ను మైక్రోసాఫ్ట్ వెనక్కి నెట్టిందని కంపెనీ వెల్లడించింది.ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది చివర్లో ఏఐ ఆధారిత 'కో పైలెట్ సూపర్ యాప్'ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సూపర్ యాప్ ద్వారా చాట్, కోడింగ్, కార్యాలయ సహకార టూల్స్, ఆటోమేటెడ్ ఏఐ ఏజెంట్లు వంటి అనేక సేవలను ఒకే వేదికపై అందించనున్నారు. వినియోగదారులతో పాటు వ్యాపార సంస్థల అవసరాలను కూడా తీర్చేలా ఈ యాప్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు.కాగా, మైక్రోసాఫ్ట్‌కు 2026 ఒక రికార్డు స్థాయి ఆర్థిక సంవత్సరం అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. కంపెనీ వార్షిక ఆదాయం 331 బిలియన్ డాలర్లను దాటిందని తెలిపారు. అందులో మొత్తం క్లౌడ్ వ్యాపారం ద్వారా 214 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ ప్రధాన క్లౌడ్ వ్యాపారమైన అజూర్, తొలిసారిగా 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు.

# గ్యాస్ సిలిండర్ ధరలు



గత నెలలో గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(జులై) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం(జులై 30) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50




# ‘భోగి’ క్లైమాక్స్ షెడ్యూల్ కంప్లీట్

శర్వానంద్ హీరోగా, దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ ‘భోగి’. తాజాగా ఈ సినిమా షూటింగ్‌పై అదిరిపోయే అప్డేట్ పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా క్లైమాక్స్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంటున్నట్లు తెలిపారు. 3 నెలల ప్రణాళిక, 22 రోజుల షూటింగ్ తర్వాత 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో టీమ్ భోగి తన ఎపిక్ క్లైమాక్స్‌ను పూర్తి చేసుకోగా.. ఈ క్లైమాక్స్ సినిమాకు హైలెట్‌గా నిలవనుందని చెబుతున్నారు మేకర్స్. అంతేకాకుండా గంగ పాత్రకు జీవం పోయడానికి శర్వానంద్ ప్రతి షాట్‌లో తన అత్యుత్తమ నటనను కనబరుస్తూ, ప్రతి షాట్‌కు ముందు 2.5 గంటల మేకప్‌ను భరిస్తూ ఈ సినిమా కోసం సర్వశక్తులు శ్రమిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజెంట్ మేకర్స్ ఇచ్చిన అప్డేట్‌తో భోగి సినిమాపై హైప్ మరింత పెరిగింది. కాగా.. ఈ చిత్రంలో శర్వ మునుపెన్నడు లేని విధంగా కనిపించనున్నట్లు తెలుస్తుండగా.. శర్వ కెరీర్‌లో ఇదొక భారీ సినీ దృశ్యకావ్యంగా రూపుదిద్దుకుంటోందని టాక్.

# పళ్ళ బురుసు టీజర్



అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ తెరకెక్కిస్తున్న వినూత్న ప్రాజెక్టు ‘పళ్ళ బురుసు’. ఉదయ్ చౌహాన్ కథ, దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. ప్రజ్వల్, గోమతి రెడ్డి, కిరణ్ మాచా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను అక్కినేని హీరో నాగచైతన్య సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ.. “పళ్ళ బురుసు’ టీజర్‌ను మీ ముందుకు తీసుకురావడం సంతోషంగా ఉంది. ప్రేమ, నవ్వులు మరియు భావోద్వేగాలతో కూడిన ఒక విభిన్నమైన కథ ఇది.. చూసి ఎంజాయ్ చేయండి’ అంటూ టీజర్ పంచుకున్నాడు. కాగా.. తెలుగు సంస్కృతి, ప్రాంతీయతను ప్రతిబింబించే ఈ చిత్రం వినోదభరితమైన కామెడీ-డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వినూత్న కాన్సెప్ట్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌తో ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ‘పళ్ళబురుసు’ 2026 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# సరికొత్త రికార్డు సృష్టించిన ‘స్పైడర్-మ్యాన్



టామ్ హాలండ్, జెండయా, సాడీ సింక్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే’ చిత్రానికి డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహించారు. మార్వెల్ స్టూడియోస్, పాస్కల్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈరోజు ప్రపంచవ్యాప్తంగా భారీ సాయిలో విడుదల కానుంది. ఇప్పటికే నిన్న పలు ప్రాంతాల్లో ప్రీమియర్ షోలు ప్రదర్శించగా, ప్రేక్షకుల నుంచి చిత్రానికి మంచి స్పందన లభించింది. మొదటి నుంచే ఈ సినిమాపై ఇండియన్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.దాంతో బుక్‌మైషోలో ఈ చిత్రానికి 2 మిలియన్లకు పైగా ప్రీ-సేల్స్ నమోదయ్యాయి. దీంతో భారతదేశంలో బుక్‌మైషోలో అత్యధిక ప్రీ-సేల్స్ సాధించిన చిత్రాల జాబితాలో ‘స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే’ ఆరో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ‘పుష్ప పార్ట్ 2’ 3 మిలియన్ ప్రీ-సేల్స్‌తో తొలి స్థానంలో కొనసాగుతోంది. ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ 2.9 మిలియన్లతో రెండో స్థానంలో, ‘కూలీ’ 2.51 మిలియన్లతో మూడో స్థానంలో, ‘దురంధర్ 2’ 2.40 మిలియన్లతో నాలుగో స్థానంలో, ‘లియో’ 2.29 మిలియన్లతో ఐదో స్థానంలో ఉన్నాయి.



# గ్లామర్ షోతో మతిపోగొడుతున్న...

మోస్ట్ బ్యూటిఫుల్ నటి నేహా శెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఆమె 2016లో విడుదలైన కన్నడ చిత్రం ‘ముంగారు మలే 2’ ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అనంతరం ‘మెహబూబా’ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ‘గల్లీ రౌడీ’ చిత్రంలో నటించింది.అయితే, ‘డీజే టిల్లు’ చిత్రంలోని రాధిక పాత్ర ఆమెకు మంచి గుర్తింపుతో పాటు తొలి కమర్షియల్ విజయాన్ని అందించింది. ఈ సినిమాలో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నేహాకు వరుస అవకాశాలు దక్కాయి. ఇటీవల ఆమె ప్రదీప్ రంగనాథన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘డ్యూడ్’ చిత్రంలో నటించింది.సినిమాల్లో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నేహా శెట్టి సోషల్ మీడియాలో కూడా ఎంతో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని కొత్త ఫొటోలను పంచుకుంది.చెక్స్ డిజైన్ డ్రెస్‌లో స్టైలిష్ లుక్‌లో కనిపించిన నేహా, ట్రెండీ అవుట్‌ఫిట్‌తో కెమెరాకు వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. చేతులకు రింగ్స్ ధరించి, కురులను అందంగా వదిలేసిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.


ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# సైడ్ లుక్‌లో స్టన్నింగ్

కావ్య థాపర్ గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 2013లో విడుదలైన తత్కాల్ చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఈ అందాల భామ, కొంత విరామం తర్వాత 2018లో విడుదలైన ‘ఈ మాయ పేరేమిటో’ సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టింది.ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించి తన అందం, అభినయంతో ప్రేక్షకుల మనసు దోచుకుంది. చివరిసారిగా గోపీచంద్ హీరోగా తెరకెక్కిన విశ్వం చిత్రంలో కనిపించిన కావ్య థాపర్‌కు ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. దీంతో కొంతకాలంగా ఆమెకు అవకాశాలు తగ్గాయి. ప్రస్తుతం కావ్య, హవీష్ హీరోగా, త్రినాథ్ రావు నక్కిన దర్శకత్వంలో రూపొందుతున్న నేను రెడీ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.ఈ చిత్రం ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ విజయాన్ని అందుకుంటే కావ్యకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా కావ్య థాపర్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.ఈ ఫొటోల్లో ఆమె భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌తో అలరించే పలుచటి పింక్ చీరను ధరించి, దానికి తగ్గ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో స్టైలిష్‌గా మెరిసింది. ముఖ్యంగా సైడ్ యాంగిల్‌లో ఆమె అందాలు మరింత హైలైట్ అవగా, బ్యాక్ పోజులతోనూ అభిమానులను ఆకట్టుకుంది.కొన్ని చిత్రాల్లో స్టైలిష్ గాగుల్స్‌తో పాటు మెడలో తెల్లని హారం ధరించి, కురులను అందంగా వెనక్కి వదిలేసిన కావ్య లుక్ మరింత స్పెషల్‌గా కనిపించింది. మొత్తంగా ఈ ఫొటోల్లో ఆమె గ్లామర్, స్టైల్, ఎలిగెన్స్ కలిసి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. దీంతో ఈ అందాల భామ తాజా ఫొటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి.

# 'రామాయణ' ట్రైలర్ వచ్చేసింది





అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రామాయణ ట్రైలర్ వచ్చేసింది. నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణ పార్ట్ 1 ట్రైలర్ ను తాజాగా చిత్ర బృందం రిలీజ్ చేసి అందరికీ సర్ ప్రైజ్ చేసింది. దాదాపు 4.09 నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్ జనాలను ఆకట్టుకుంటుంది. ఇక ఇందులో రణ్ బీర్ కపూర్ రాముడిగా... సీతమ్మ పాత్రలో సాయి పల్లవి అదరగొట్టేశారు. అటు యశ్ రావణుడి గెటప్ లో అందరిని బెదరగొట్టేశాడు. భారీ విజువల్స్, BGM ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అటు హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ అందించిన సంగీత స్వరాలు సినిమాకు హైలెట్ గా నిలిచాయి. దాదాపు రూ. 4000 కోట్లతో రూపొందుతున్న ఈ రామాయణ మూవీ మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి రిలీజ్ కానుంది. రెండో పార్ట్ వచ్చే దీపావళికి రిలీజ్ చేస్తారు.

# దర్శకులకు తలనొప్పి తప్పదా



కోలీవుడ్ దిగ్గజ నటులు రజనీకాంత్ అండ్ కమల్ హాసన్ సినిమాల విషయంలో తమ ప్రాధాన్యతల్ని మార్చేసుకుంటున్నారు. రజనీ 173 విషయంలో దర్శకులెందరో మారారు. సుందరి సి ఫస్ట్ కథ చెబితే ఓకే అయ్యింది. ఫైనల్ స్టేజ్ కు వచ్చేసరికి నో చెప్పాడు తలైవర్. సిబి చక్రవర్తి సెట్ అయ్యాడు అనుకుంటే.. భారీ స్కేల్ అదీ ఇది అంటూ కహానీలు చెప్పి తప్పించేశారు. చివరకు అశ్వత్ మారిముత్తు కొత్త కథతో రావడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. అదే ధర్మన్ గా తెరకెక్కుతోంది. కమల్ హాసన్ కూడా తన 237 ప్రాజెక్ట్ ఇలాగే మార్పులు సంతరించుకోబోతుంది.థగ్ లైఫ్ ఫ్లాప్ తర్వాత కమల్ హాసన్ స్టంట్ మాస్టర్స్ అన్బరివ్‌కు డీల్ చేసే ఛాన్స్ ఇచ్చాడు. రెండేళ్ల క్రితం ఈ మూవీ ఎనౌన్స్ చేశారు. తమిళనాడు ఎన్నికల తర్వాత ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని రీసెంట్లీ వెల్లడించాడు ఉళగ నాయగన్. కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ హోల్డ్ అయ్యిందని తెలుస్తోంది. కొన్ని టెక్నీకల్ ఇష్యూస్, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ వల్ల డిలే అవుతుందట. దీంతో టైమ్ వేస్ట్ కాకూడదన్న ఉద్దేశంతో మరో దర్శకుడ్ని లైన్లో పెట్టినట్లు సమాచారం. చిన్నా ఫేమ్ ఎస్ యు అరుణ్ కుమార్ చెప్పిన కథకు కమల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని కోలీవుడ్ టాక్. గత ఏడాది వీర ధీర శూరన్‌తో ఓకే అనిపించుకున్నాడు ఈ దర్శకుడు. తాజాగా ఉళగనాయగన్‌తో కొలబరేషన్‌కు రెడీ అయ్యాడు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతుందట. త్వరలో పట్టాలెక్కబోతుందని సమాచారం. ప్రస్తుతం కమల్ వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నాడు. ఇటు నిర్మాతగా వరుస చిత్రాలకు కమిట్ అయ్యాడు. కల్కి2తో పాటు రజనీతో మల్టీస్టారర్ మూవీ చేస్తుండగా సియోన్, ధర్మన్ చిత్రాలను నిర్మిస్తున్నాడు.

# కళ్లల్లో నీళ్లు తిరిగాయి



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని తాజాగా ‘శ్రీనివాస మంగాపురం’ చిత్రంలో హీరోగా నటించాడు. ఈ చిత్రంలో రషా తడాని హీరోయిన్‌గా నటించగా, అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. జూలై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం జోరుగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. అందులో భాగంగా జయకృష్ణ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా “ఈ సినిమా షూటింగ్ సమయంలో ఓ రోజు హీరోయిన్‌కు గాయమై రక్తం రావడంతో మీరు ఎమోషనల్ అయ్యి కళ్లల్లో నీళ్లు తెచ్చుకున్నారని వినిపించింది. అది నిజమేనా?” అనే ప్రశ్న ఆయనకు ఎదురైంది.దీనికి జయకృష్ణ స్పందిస్తూ.. అవును, అది నిజమే. ఒక రోజు షూటింగ్‌లో హీరోయిన్‌పై యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, ఆమెకు అనుకోకుండా గాయమైంది. దాంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున రక్తం కారణం ప్రారంభమైంది. ఆ పరిస్థితిని చూసి నాకు చాలా బాధ వేసింది. తెలియకుండానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మా సినిమా షూటింగ్ ప్రారంభమైన కొద్ది రోజులకే ఈ ఘటన జరిగింది. నా సినీ ప్రయాణం మొదలైన కొత్తలోనే ఇలాంటి సంఘటన జరగడం కూడా నన్ను మరింత కలచివేసిందని చెప్పుకొచ్చాడు. చాలా సంవత్సరాల తర్వాత సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో హీరో ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండటంతో, జయకృష్ణ ఎంట్రీపై ఘట్టమనేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి తన తొలి చిత్రంతో ఆయన ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**